ఆదివారం
18-06-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 356
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ఉగాండాలో ఉగ్రఘాతుకం

ఉగాండాలో ఉగ్రదాడి జరిగింది. తుపాకులు, పదునైన ఆయుధాలతో ఉగాండా-కాంగో సరిహద్దులోని మపాండ్వే పట్టణ పాఠశాలపై సాయుధ తిరుగుబాటుదారులు దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో 41 మంది మరణించారు. మృతులలో 38 మంది విద్యార్థులు, ఒక గార్డు, ఇద్దరు స్థానికులు ఉన్నారు.

2 లో

ఆ డబ్బు ఎక్కడ?

- లెక్కతేలని రూ.88 వేల కోట్ల విలువైన రూ.500 నోట్లు
- ఆర్టీఐ వద్ద లేని సమాచారం

న్యూఢిల్లీ: రూ.2వేల నోట్లను ఉపసంహరించుకున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించడం, వాటి మార్పిడికి సెప్టెంబరు వరకు భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) గడువు ఇచ్చిన నేపథ్యంలో రూ.500 నోట్ల ముద్రణ, చెలామణి అంశం తెరపైకొచ్చింది. ఇదే క్రమంలో సామాజిక కార్యకర్త మనోరంజన్ రాయ్ దాఖలు చేసిన సమాచార చట్టం (ఆర్టీఐ) దరఖాస్తు ద్వారా కీలక విషయాలు బయటపడ్డాయి. దాదాపు రూ.88,032.5కోట్ల విలువైన రూ.500 నోట్లకు సంబంధించిన సమాచారం భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) వద్ద లేనట్లు తెలుస్తోంది. బెంగళూరులోని భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ లిమిటెడ్, నాశిక్‌లోని కరెన్సీ నోట్ ప్రెస్, మధ్యప్రదేశ్ దేవస్‌లోని బ్యాంక్ నోట్ ప్రెస్‌లో దేశానికి అవసరమైన కరెన్సీ నోట్లు ముద్రిస్తారు. 2016-17లో 1,662 మిలియన్ల రూ.500 నోట్లను ముద్రించినట్లు నాశిక్ మింట్ వెల్లడించింది. బెంగళూరులో 5,195.65 మిలియన్లు, దేవస్‌లో 1,953 మిలియన్ల నోట్లు ముద్రించినట్లు ఆర్టీఐ ద్వారా వెల్లడైంది. అంటే మూడు ముద్రణాలయాలలో 8,810.65 మిలియన్ల రూ.500 నోట్లు ముద్రించారు. అయితే ఇందులో - మిగతా 2 లో

హరగోపాల్‌పై ఉపా కేసు

ఎత్తివేత

డీజీపీకి కేసీఆర్ ఆదేశాలు

విశాలాంధ్ర-హైదరాబాద్: పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ ఇతరులపై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(ఉపా) కింద నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారు. కేసుల ఎత్తివేతకు వెంటనే తగు చర్యలు తీసుకోవాలని డీజీపీ అంజనీకుమార్‌ను ఆదేశించారు. మావోయిస్టు కార్యకలాపాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలపై హరగోపాల్‌తో పాటు ఇతర ప్రజాసంఘాల నేతలపై ఉపా చట్టం కింద తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎలాంటి తప్పు చేయకపోయినా, ఆధారాలు లేకుండా ఉపా చట్టం కింద కేసు నమోదు చేయడం దారుణమనీ,. వెంటనే వారిపై నమోదు చేసిన కేసు ఎత్తివేయాలని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశాయి. ఈ నేపథ్యంలో అన్ని అంశాలను పరిశీలించిన కేసీఆర్ హరగోపాల్, ఇతరులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేతకు నిర్ణయం తీసుకున్నారు.

కేసును వెనక్కి తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నాం: నారాయణ

ప్రముఖ హక్కుల కార్యకర్త ప్రొఫెసర్ హరగోపాల్‌తో పాటు 152 మందిపై ములుగు పోలీస్ స్టేషన్లో ఉపా కేసు నమోదు చేయడానికి సీపీఐ తో పాటు వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు వ్యతిరేకించడంతో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఉపా కేసును వెనక్కి తీసుకోవాలని - మిగతా 2 లో

పెద్దనోట్ల చలామణికి

చెన్నై అడ్డా !

- జోరుగా బంగారం, వజ్రాల వ్యాపారం
- రాష్ట్రంలో స్థిరాస్తుల క్రయ, విక్రయాలకు వినియోగం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రెండు వేల నోట్ల చలామణికి పొరుగు రాష్ట్ర రాజధాని చెన్నై అడ్డాగా మారింది. స్వరాష్ట్రంలో కంటే పక్క రాష్ట్రం తమిళనాడులో పెద్దనోట్లు మార్చుకోవడం బ్లాక్ మనీదారులకు సులభంగా మారింది. దీంతో ఎక్కువగా బంగారం, వజ్రాల కొనుగోళ్ల పేరుతో పెద్దనోట్లు చలామణి అవుతున్నాయి. రాజకీయ నేతలు, బడా వ్యాపారులు తమ వద్ద ఉన్న బ్లాక్ మనీని వైట్ చేసుకోవడానికి ఇదే పెద్ద అవకాశంగా మారింది. బంగారు షాపు యజమానులు ఇదే అదనుగా ధర పెంచి మరీ జోరుగా వ్యాపారం సాగిస్తున్నారు. పెద్దనోట్ల మార్పు గడువు తేదీ దగ్గర పడుతున్న కొద్దీ బ్లాక్ మనీదారులు తమ దగ్గర ఉన్న రూ.2వేల నోట్ల మార్పుకు త్వరపడుతున్నారు. వారి కంగారును బంగారు వ్యాపార యజమానులు అవకాశంగా మార్చుకుంటూ భారీగా లాభాలు గడిస్తున్నారు. అయితే రూ. 2వేల నోట్లు తీసుకోవాలంటే గ్రాముకి రూ.300 నుంచి రూ.500 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తుందని షరతు విధిస్తున్నారు. అదే వంద గ్రాముల బిస్కట్ అయితే రూ.50 నుంచి రూ.70 వేలు అదనంగా గుంజుతున్నారు. వజ్రాభరణాల విక్రయాల్లోనూ రెట్టింపు లాభాలను ఆర్జిస్తున్నారు. బ్లాక్ మనీదారులకు కూడా తమ వద్ద పెద్దమొత్తంలో ఉన్న నోట్లను మార్చుకోవడానికి ఇదే తేలికైన మార్గంగా కనపడుతుండడంతో, అధికంగా చెల్లించడానికి సైతం వెనుకాడడం లేదు. ఇక పెద్దనోట్లు అందజేయడానికి, దానికి తగ్గ బంగారం స్వీకరించడానికి చెన్నైని కేంద్రంగా చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రజలు తమ దగ్గరున్న రూ.2వేల నోట్లను సెప్టెంబరు 30వ తేదీలోగా మార్చుకోవాలని భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ)సూచించింది. విచిత్రమేమిటంటే మార్కెట్లో ఎక్కడా సాధారణ, మధ్యతరగతి, చివరకు ఉద్యోగుల వద్ద కూడా రూ.2వేల నోట్లు కానరావడం లేదు. బ్యాంకు సిబ్బంది కూడా ఖాతాదారుల నుంచి తమ వద్దకు పెద్దనోట్లు ఎక్కువగా రావడం లేదని చెపుతున్నారు. గతంలో రూ.500, రూ.1000 నోట్లు రద్దు చేసినప్పుడు వాటిని మార్చుకోవడానికి క్యూలు కట్టారు. అన్ని బ్యాంకులు కిక్కిరిసిపోయాయి. కాని ఇప్పుడు ఆ పరిస్థితి కానరావడం లేదు. బ్యాంకుల్లో పరిస్థితి చూస్తుంటే 4లక్షలకు పైగా ముద్రించిన రూ.2వేల నోట్లన్నీ ఏమయ్యాయనే ఆశ్చర్యం - మిగతా 2 లో



మళ్లీ వెయ్యి కోట్లు అప్పు కోసం దస్త్రం సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ప్రతి మంగళవారం రిజర్వు బ్యాంక్ వద్ద సెక్యూరిటీ బాండ్ల వేలంలో పాల్గొంటూ రుణ సేకరణ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వచ్చే మంగళవారం కూడా మరో వెయ్యి కోట్లు అప్పు చేసేందుకు దస్త్రం సిద్ధం చేసింది. వీటిలో రూ.500 కోట్లు తొమ్మిది సంవత్సరాల్లో చెల్లించేలా, మరో రూ.500 కోట్లు 17 ఏళ్లకు చెల్లింపులు చేసేలా రుణం తీసుకునేందుకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈనెల 20న రిజర్వ్ బ్యాంక్ వద్ద వెయ్యి కోట్ల సెక్యూరిటీ బాండ్ల వేలం వేయనుంది. ఈ వెయ్యి కోట్లతో కలిపితే ఈ ఏడాది ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలో రూ.20,500 కోట్లకు చేరుకుంటుంది. ఇక డిసెంబరులో ముందస్తు ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో భాగంగానే డిసెంబరు వరకు ఉన్న అప్పు - మిగతా 2 లో

అరాచకాలకు సీఎం, డీజీపీనే

బాధ్యత వహించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విద్యుత్ చార్జీలను నిరసిస్తూ నేడు వామపక్షాల రాష్ట్ర సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ : ఏపీలో రౌడీలు, అల్లరి మూకల అరాచకాలు, దురాగతాలు నానాటికీ పెరిగిపోతున్నాయని, అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి బాధ్యత వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నేరాలు అదుపులోకి వచ్చాయని, విశాఖపట్నంలో రౌడీయిజం లేదని, భూ కబ్జాలు లేవని డీజీపీ చెప్పడం హాస్యాస్పదమన్నారు. ఈ మేరకు రామకృష్ణ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి స్పృహలో ఉండి మాట్లాడుతున్నారో లేదోననే అనుమానం తలెత్తుతోందన్నారు. గత రెండు, మూడు ఏళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా నేరాలు అదుపులోకి వచ్చాయని చెప్పడం హాస్యాస్పదమని, రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలకు విశాఖపట్నంలో జరిగిన ఘటన పరాకాష్ట అని పేర్కొన్నారు. సాక్షాత్తూ అధికార పార్టీ ఎంపీ కుటుంబాన్ని, ఆడిటర్‌ను కిడ్నాప్ చేసి, కొట్టి, డబ్బులు వసూలు చేసి దుర్మార్గంగా వ్యవహరించడం డీజీపీకి కనపడలేదా, ఇది రౌడీయిజం కాదా అని ప్రశ్నించారు. అనంతపురంలో తన భూమి కబ్జాకు గురవ్వడంతో ఒక ప్రింటింగ్ ప్రెస్ యజమాని సూసైడ్ లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నట్లు - మిగతా 2 లో

నర్సుల వ్యథ

విధుల కేటాయింపు 'వివక్ష'
ప్రశ్నిస్తే పని భారమే
నిత్యం రోస్టర్ల మార్పు

ప్రభుత్వాస్పత్రుల నర్సుల విధుల కేటాయింపు తీవ్ర వివక్షతకు దారితీస్తోంది. వైద్యారోగ్యశాఖను ప్రక్షాళన చేస్తున్నామంటూ ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న జగన్ ప్రభుత్వం, అంతకంటే ముందస్తుగా విధుల కేటాయింపు ముసుగులో అవినీతి దందాకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి, చర్యలకు ఉపక్రమించాలని బాధితులు కోరుతున్నారు.

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వాస్పత్రుల నర్సుల విధుల కేటాయింపు తీవ్ర వివక్షతకు దారితీస్తోంది. కొందరిపై పనిభారం, మరికొందరికి పని లేకుండా అడుగడుగునా అసమానతలు చూపడంపై విమర్శలున్నాయి.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యశాలలు, బోధనాస్పత్రుల్లో పనిచేస్తున్న నర్సుల విధుల్ని ఆసరాగా తీసుకుని, అడ్డగోలుగా రోస్టర్లు మారుస్తూ కొందరు రింగ్‌గా మారి చక్రం తిప్పుతున్నట్లు సమాచారం. కాసులను, కానుకలు ఇచ్చిన వారికే లైట్ వార్డు (ఓపీతోపాటు రోగుల సంఖ్య తక్కువగా ఉండేవి) విధులు వేయడం, లేదా వారికి నైట్ డ్యూటీ లేకుండా చూడటం లాంటి సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ముడుపులు, కానుకలు ఇవ్వని వారినేమో నిత్యం రోగులతో కిక్కిరిసి ఉండే క్యాజువల్, సర్జికల్ వార్డుల్లో బలవంతంగా పంపి వారిని శ్రమ దోపిడీకి గురిచేయడం, వరుస వారీగా నైట్ డ్యూటీలు వేస్తున్నట్లు సమాచారం. వారికి సెలవుల కేటాయింపులోనూ చేతివాటానికి పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. నిత్యం రోస్టర్ల విధానం మార్పిడితో కొందరు నర్సులపై పని ఒత్తిడి పెరిగి అనారోగ్యాలకు గురవుతున్నారు. గుంటూరు, తిరుపతి, కడప, అనంతపురంలలో అధికంగా ఈ అడ్డగోలు, అవినీతి విధానం చాప కింద నీరులా కొనసాగుతున్నట్లు తెలిసింది. రాష్ట్ర వ్యాప్తంగా కొందరు అధికారులు రింగ్ లీడర్లుగా మారిపోయి, ఏళ్ల తరబడి సీట్లలో పాతుకుపోయి, డిప్యూటేషన్లపై వచ్చి ఈ తరహాగా విధుల - మిగతా 2 లో

మరో రెండు రోజులు ఎండలే!

- మూడు రోజుల్లో రుతుపవనాల విస్తరణ
- నేడు, రేపు తీవ్ర వడగాడ్పులు
- జాగ్రత్తగా ఉండాలని విపత్తుల సంస్థ హెచ్చరిక

2 లో

ఇదీ లోకం!

యస్, అన్నే మా భవిష్యత్తు!

ఎంపీ మోపిదేవికి

నిరసన సెగ

చెరుకుపల్లిలో గోబ్యాక్ అంటూ నినాదాలు
మేమే లక్ష ఇస్తాం వెళ్లిపోమన్న గ్రామస్తులు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గం చెరుకుపల్లిలో సజీవదహనమైన అమర్‌నాథ్ కుటుంబాన్ని పరామర్శించేందుకు శనివారం ఉదయం ఉప్పలవారిపాలెంకు వెళ్లిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణకు నిరసన సెగ తగిలింది. పదో తరగతి చదువుతున్న ఓ బాలుడిని ఒక యువకుడు పెట్రోలు పోసి సజీవ దహనం చేసిన ఘటన రాజోలులో శుక్రవారం ఉదయం సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు గ్రామానికి వచ్చిన మోపిదేవి వెంకటరమణ గ్రామంలోకి రావొద్దంటూ బాలుడి బంధువులు, స్థానికులు అడ్డుకున్నారు. కనీసం బాధిత కుటుంబం - మిగతా 2 లో

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

- కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌లో ముర్ము
- తొలిసారి రివ్యూయింగ్ అధికారిగా రాష్ట్రపతి

విశాలాంధ్ర-హైదరాబాద్: సవాళ్లను ఎదుర్కొనేందుకు సరికొత్త సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, దేశం కోసం ప్రాణాలర్పించిన వారి సేవలను గుర్తుపెట్టుకోవాలని ఎయిర్‌ఫోర్స్ అకాడమీ క్యాడెట్లకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సూచించారు. ఫైటర్‌జెట్ పైలట్లలో మహిళలు ఎక్కువమంది ఉండటం హర్షణీయమన్నారు. ముర్ము శనివారం తెలంగాణ, దుండిగల్‌లోని ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో జరిగిన కంబైన్డ్ గ్రాడ్యుయేషన్ పరేడ్‌కు రివ్యూయింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ముర్ము మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన వారి సేవలను క్యాడెట్లు గుర్తుంచుకోవాలన్నారు. భారత వైమానిక దళ సేవలను కొనియాడారు. టర్కీ భూకంప సహాయక చర్యల్లో పాల్గొనడం, కరోనా సమయంలో అద్భుతంగా పనిచేసినట్లు ప్రశంసించారు. సుఖోయ్ జెట్‌లో ప్రయాణం గొప్ప అనుభూతి ఇచ్చిందని తెలిపారు. ఈ పరేడ్‌లో పాల్గొనడం సంతోషంగా ఉందన్న ముర్ము... క్యాడెట్లకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అయితే - మిగతా 2 లో

ఉగాండాలో ఉగ్రఘాతుకం

తుపాకులు, పదునైన ఆయుధాలతో స్కూలుపై దాడి, డార్మిటరీకి నిప్పు

41 మంది దుర్మరణం : మృతుల్లో 38 మంది విద్యార్థులు

కంపాలా: ఉగాండాలో ఉగ్రదాడి జరిగింది. తుపాకులు, పదునైన ఆయుధాలతో ఉగాండా-కాంగో సరిహద్దులోని మపాండ్వే పట్టణ పాఠశాలపై సాయుధ తిరుగుబాటుదారులు దాడికి తెగబడ్డారు. ఈ ఘటనలో 41 మంది మరణించారు. మృతులలో 38 మంది విద్యార్థులు, ఒక గార్డు, ఇద్దరు స్థానికులు ఉన్నారు. డార్మిటరీకి తిరుగుబాటుదారులు నిప్పుపెట్టగా కొందరు విద్యార్థులకు తీవ్రమైన కాలిన గాయాలు అయ్యాయి.

గుర్తుపట్టలేని విధంగా కాలిపోయిన మృతదేహాలు ఘటనాస్థలిలో కనిపించాయి. తుపాకీలతో కాల్చి, పదునైన కత్తులతో పొడిచి విద్యార్థులను అలైడ్ డెమొక్రటిక్ ఫోర్సెస్ (ఏడీఎఫ్)కు చెందిన తిరుగుబాటుదారులు హతమార్చినట్లు మప్వాండే-లుబిరిహా మేయర్ సెలెవెస్ట్ మపోజే శనివారం తెలిపారు. అపహరణలు కూడా జరగాయని, అయితే ఎంత మందిని ఎత్తుకుపోయారో తెలియలేదని చెప్పారు. 'లుబిరిరా సెకండరీ ప్రైవేటు స్కూల్లో బాలబాలికలు కలిసి చదువుకుంటారు. ఉగాండా-కాంగో సరిహద్దు జిల్లాలైన కసేసొగాకు 2కిమీల దూరంలో ఉంది. డార్మిటరీ వద్ద లభ్యమైన 25 మృతదేహాలను బవేరా ఆసుపత్రికి తరలించాం. మరో ఎనిమిది మంది పరిస్థితి విషమంగా ఉంద'ని పోలీసు ప్రకటన పేర్కొంది. తిరుగుబాటుదారుల జాడను పోలీసులు గుర్తించారు. కాంగోలోని విరుంగా నేషనల్‌పార్కులో నక్కివున్నట్లు గుర్తించారు. అపహరించిన వారిని విడిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సైన్యం పేర్కొంది. చనిపోయిన వారిలో కొందరి శరీరాలు గుర్తుపట్టలేనట్లు ఉన్నాయని ఉగాండా అధ్యక్షుడికి అధికార ప్రతినిధి జో వలుసింబి వెల్లడించారు. 'ఇది పిరికి పందచర్య. స్కూళ్లపై దాడులు ఆక్షేపణీయం, పిల్లల హక్కుల హరణ ఘోరం, బడి అన్నది ప్రతి విద్యార్థికి సురక్షితమైన చోటుగా ఉండాల'ని రాజకీయ నాయకులు విన్నీ కిజా ట్విట్టర్ మాధ్యమంగా ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇదిలావుంటే తూర్పు కాంగోలోని మారుమూల ప్రాంతాల్లోని పౌరులను లక్ష్యంగా చేసుకొని అనేక దాడులకు ఏడీఎఫ్ తెగబడినట్లు తెలుస్తోంది. ఉగాండా అధ్యక్షుడిగా 1986 నుంచి అధికారంలో ఉన్న యోవేరి ముసెవేరి పాలనను ఏడీఎఫ్ వ్యతిరేకం. మార్చిలోనూ కాంగోలో 19 మంది హత్యకు పాల్పడింది. ఏడీఎఫ్‌ను తుడిచిపెట్టే ప్రయత్నాలు

కొనసాగుతున్నాయి. ఇందుకోసం 2021లో కాంగోలో వైమానిక దాడులు కూడా జరిగాయి.

మానవాళి ప్రయోజనాలే ముఖ్యం

అమెరికా, చైనా సంబంధాలకు ప్రజలే మూలం

పాత మిత్రుడు బిల్ గేట్స్‌తో భేటీలో జిన్‌పింగ్

బీజింగ్: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, తన పాత మిత్రుడు బిల్‌గేట్స్‌తో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ భేటీ అయ్యారు. కోవిడ్ మహమ్మారి క్రమంలో సుమారు మూడేళ్ల తర్వాత ఇద్దరు స్నేహితులు కలుసుకొని సంతోషంగా ముచ్చటించుకున్నారు. ఈ మేరకు సీసీటీవీ వార్తాసంస్థ పేర్కొంది. అమెరికా, చైనా మధ్య ఉద్రిక్త పరిస్థితుల క్రమంలో ఆంటోని బ్లింకన్ పర్యటన ఉండటంతో ముందు తాజా పరిణామం చోటుచేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. జిన్‌పింగ్ మాట్లాడుతూ ప్రపంచంలోని ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రెండు దేశాల ప్రజలే కాకుండా మొత్తం మానవాళికి ప్రయోజనకరంగా ఉండే కార్యకలాపాలను చేపట్టేందుకు సిద్ధమని, అమెరికా, చైనా మధ్య సంబంధాలకు ప్రజలే మూలాధారమని నొక్కిచెప్పారు. మానవహక్కుల ఉల్లంఘనల క్రమంలో సినో- యూఎస్ సయోధ్య దెబ్బతిందని అన్నారు. ప్రపంచ దేశాల్లో పేదరిక నిర్మూలనకు, ఆరోగ్యం, అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న గేట్స్ ఫౌండేషన్ కృషిని జిన్‌పింగ్ ప్రశంసించారు. సంబంధిత రంగాల్లో సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి, ఇతర వర్ధమాన దేశాలకు సాయం చేయడానికి బిల్‌గేట్స్, ఆయన ఫౌండేషన్‌తో కలిసి పనిచేసేందుకు చైనా సుముఖంగా ఉందని చెప్పారు. ఈ ఏడాది బీజింగ్‌లో కలిసిన మొదటి అమెరికన్ మిత్రుడు మీరేనని జిన్‌పింగ్ వ్యాఖ్యానించారు. బిల్‌గేట్స్ మాట్లాడుతూ జిన్‌పింగ్‌ను కలుసుకోవడం చాలా సంతోషంగా, గౌరవంగా ఉన్నట్లు తెలిపారు. అభివృద్ధిని చైనా మరింత వేగిరం చేస్తోందని. ఇది చైనాకే కాకుండా, యావత్ ప్రపంచానికి ప్రయోజనకరమని అన్నారు. ప్రజారోగ్యం, ఫార్మాస్యూటికల్ పరిశోధన, అభివృద్ధి, గ్రామీణ, వ్యవసాయ రంగాల్లో, దారిద్ర్య నిర్మూలన కార్యక్రమాల్లో చైనాతో సహకారాన్ని తమ ఫౌండేషన్ మద్దతిస్తున్నట్లు బిల్ గేట్స్ తెలిపారు. ఇదిలావుంటే అమెరికా సెక్రటరీ ఆఫ్ స్టేట్ ఆంటోని బ్లింకన్ ఆదివారం చైనా చేరుకోనున్నారు. ఆయన రెండు రోజుల పాటు చైనాలో పర్యటిస్తారు. 2018 తర్వాత చైనాలో పర్యటించిన మొదటి సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా బ్లింకన్ నిలుస్తారు. చైనా విదేశాంగ మంత్రి క్విన్ గాంగ్‌తో ఆయన సమావేశమవుతారు. చైనా అధ్యక్షుడితోనూ బ్లింకన్ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నట్లు అధికారిక వర్గాల సమాచారం.



ద్వైపాక్షిక బంధం మరింత బలోపేతం

ఇరాన్, క్యూబా సంకల్పం : ఆరు ఒప్పందాలపై సంతకాలు

టెహ్రాన్: తమ మధ్య ద్వైపాక్షిక, స్నేహ బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని, క్యూబా, ఇరాన్ సంకల్పించాయి. ద్వైపాక్షిక ఒప్పందాలపై రెండు దేశాధినేతలు సంతకాలు చేశారు. బహుపాక్షిక సహకారానికి క్యూబా అధ్యక్షుడు మిగుల్ డియాజ్ కెనల్, ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ అంగీకరించారు. ఈ మేరకు క్యూబాకు చెందిన గ్రాన్మా వార్తాపత్రిక పేర్కొంది. ఆరు ద్వైపాక్షిక ఒప్పందాలపై ఇద్దరు సంతకాలు చేశారని, అంతకుముందు క్యూబా రాజధాని హవానాలో అధికారిక చర్చలు జరిగాయని నివేదించింది. విదేశీ వ్యవహారాలు, న్యాయ మంత్రిత్వశాఖల ద్వారా సంప్రదింపులను పెంచుకోవాలని రెండు దేశాధినేతలు నిర్ణయించినట్లు తెలిపింది. ఇందుకు సంబంధించి అవగాహన ఒప్పందాలతో పాటు ఐటీ, పోస్టల్, టెలికమ్యూనికేషన్స్ రంగాల్లో సయోధ్య పెంచుకునేలా ఒప్పందంపైనా సంతకాలు జరిగినట్లు గ్రాన్మా వెల్లడించింది.క్యూబాలో పర్యటించిన ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ అధ్యక్షుడు హెచ్‌ఈ డాక్టర్ అయాతుల్లా సయ్యద్ ఇబ్రహీం రైసీకి క్యూబా విప్లవయోధులు, ఆర్మీ జనరల్ రాల్ కాస్ట్రో రజ్ స్వాగతం పలికారు. స్నేహపూర్వకంగా, మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య మైత్రి 40ఏళ్లకుపైగా సాగుతోంది. తమ దశంపై అమెరికా అన్యాయంగా విధించిన ఆర్థిక, వాణిజ్య ఆంక్షలపై క్యూబా పోరాటానికి మద్దతిచ్చినందుకు రాల్ కాస్ట్రో కృతజ్ఞతలు తెలిపారు. తమ దేశ స్వాతంత్ర్యాన్ని, సార్వభౌమత్వాన్ని రెండు దేశాలు పరిరక్షించుకోగలిగినట్లు తెలిపారు. రెండు దేశాల మధ్య మైత్రి, సయోధ్యతో పాటు ఉన్నత స్థాయి రాజకీయ చర్చలను మరింతగా ముందుకు తీసుకెళ్లాలని క్యూబా, ఇరాన్ నిర్ణయించాయి.

మరో రెండు రోజులు ఎండలే!

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాబోయే రెండు రోజులు కూడా ఎండలు తీవ్రంగా ఉండే అవకాశాలున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ డా. బి.ఆర్.అంబేద్కర్ సూచించారు. ఆది, సోమవారాల్లో వర్షాలు కురవని పక్షంలో రాష్ట్రంలో ఎండ తీవ్రతతో పాటు వడగాల్పులు తీవ్ర ప్రభావం చూపనున్నట్లు తెలిపారు. నిప్పుల కుంపటిని తలపిస్తున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు బేజారెత్తుతున్నారు. అయితే ఈనెల 18 నుంచి 21వ తేదీ లోపు రుతుపవనాలు విస్తరించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. కాగా ఆదివారం 109 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 206 మండలాల్లో వడగాల్పులు, ఎల్లుండి 73 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 227 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో 9 మండలాలు, అనకాపల్లి 6, బాపట్ల 8, తూర్పుగోదావరి 17, ఏలూరు 12, గుంటూరు 9, కాకినాడ 18, కోనసీమ 7, కృష్ణా 15, మన్యం 5, పశ్చిమ గోదావరి జిల్లాలో 3 మండలాల్లో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఇక శనివారం కూడా సూరీడు నిప్పులు చెరిగాడు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. విజయనగరం జిల్లా కనిమెరకలో 45.1 డిగ్రీలు, మన్యం జిల్లా పాచిపెంటలో 44.9 డిగ్రీలు, ఏలూరు జిల్లా కామవరపుకోటలో 44.7, నెల్లూరు జిల్లా కొండాపురంలో 44.5, అల్లూరి జిల్లా ఎర్రంపేటలో 44.3, తూర్పుగోదావరి జిల్లా చిట్యాల, కృష్ణా జిల్లా నందివాడ, ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో 44.1, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 44 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయినట్లు వెల్లడించారు. అలాగే 188 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 176 మండలాల్లో వడగాల్పులు వీచాయన్నారు. మరోవైపు అక్కడక్కడ ఈదురుగాలులతో కురిసే వర్షాలతో పాటుగా పిడుగులు పడే అవకాశం ఉన్నందున పొలాల్లో పనిచేసే కూలీలు, పశు-గొర్రెల కాపరులు చెట్ల కింద ఉండరాదని సూచించారు.

మండుతున్న మణిపూర్

కొనసాగుతున్న హింస, అల్లర్లు

బీజేపీ నేతల ఇళ్లపై దాడులు - ఆస్తులకు నిప్పు

చెదురుమదురు కాల్పుల ఘటనలు

ఇద్దరికి గాయాలు

ఇంఫాల్: మణిపూర్‌లో హింస ఆగడం లేదు. ఈశాన్య రాష్ట్రం తగలబడిపోతూనే ఉంది. అక్కడి రెండు గిరిజన వర్గాల మధ్య వైరంతో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా జరిగిన అల్లర్లలో బీజేపీ నేతల ఇళ్లకు నిప్పుపెట్టారు. దీంతో శనివారం ఉద్రిక్తత కొనసాగింది. అనేకమంది గుమ్మిగూడటం, విధ్వంసానికి యత్నించడం, నిప్పు పెట్టడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. చెదురుమదురు కాల్పుల ఘటనలు నమోదయ్యాయి. ఇంఫాల్‌లోని ప్యాలెస్ కాంపౌండ్ ప్రాంతంలో నిప్పు పెట్టేందుకు సుమారు వెయ్యి మందితో కూడిన మూక ప్రయత్నించగా రాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) రబ్బర్ బులెట్లు పేల్చి, బాష్పవాయువు ప్రయోగించగా ఇద్దరికి గాయాలయ్యాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు చురచాంద్పూర్ జిల్లాలో కాంగ్పై, భిష్ణుపూర్ జిల్లాలోని క్వాక్తలో ఆటోమేటిక్ ఆయుధాలతో కాల్పులు జరిగినట్లు పోలీసు, ఆర్మీ వర్గాలు తెలిపాయి. మణిపూర్ విశ్వవిద్యాలయం సమీపంలో, తొంగ్జు ప్రాంతంలోని ఓ ఎమ్మెల్యే ఇంటి వద్ద వందల మంది గుమ్మిగూడి దాడికి యత్నించారు. మరో 300 నుంచి 400 మంది ఇంఫాల్ సమీపంలోని ఇరింగ్‌బామ్ పోలీస్ స్టేషన్‌లోని ఆయుధాల లూటీకి విఫలయత్నం చేశారు. ఇంఫాల్ వెస్ట్‌లోని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు శరదా దేవి ఇంటి వద్ద, సింగ్జామైలోని బీజేపీ కార్యాలయం వద్ద విధ్వంసకాండ జరిగింది. సైన్యం, అస్సాం రైఫిల్స్, రాపిడ్ యాక్షన్ ఫోర్స్, మణిపూర్ పోలీసు యంత్రాంగం సంయుక్తంగా ఈ దాడుల్ని భగ్నం చేశాయి. ఇంఫాల్ ఈస్ట్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. బీజేపీ ఎమ్మెల్యే విశ్వజిత్ సింగ్ ఇంటిని ధ్వంసం చేసేందుకు శుక్రవారం రాత్రి 10.40 గంటలప్పుడు 100 మంది యత్నించగా ఆర్‌ఏఎఫ్ అడ్డుకుంది. ఇటీవల కేంద్ర మంత్రి ఆర్కే రంజన్ సింగ్ ఇంటిపై ఇంఫాల్‌లో దాడి జరిగింది. ఓ విశ్రాంత గిరిజన ఐఏఎస్ అధికారికి చెందిన గిడ్డంగికి నిప్పుపెట్టారు. బీజేపీ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నెంచా కింప్‌గెన్ అధికారిక నివాసానికి నిప్పుపెట్టారు. ఇంఫాల్ ఈస్ట్‌లోని కేంద్రమంత్రి రాజ్‌కుమార్ సింగ్ ఇంటికి ఆందోళనకారులు నిప్పు పెట్టారు.

హరగోపాల్‌పై ఉపా కేసు ఎత్తివేత

(మొదటిపేజీ తరువాయి)

డీజీపీకి ఆదేశాలు జారీ చేయడాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె. నారాయణ స్వాగతించారు. ప్రొఫెసర్ హరగోపాల్ తెలంగాణ ఉద్యమంతో పాటు అనేక ప్రజా పోరాటాల్లో పాల్గొని మద్దతు తెలిపారని నారాయణ అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాన్ని యావత్తు దేశానికి తెలిసే విధంగా ఆయన ప్రసంగాలు చేశారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ హరగోపాల్, పద్మజా షాతోసహా మరో 152 మంది పెట్టిన ఉపా కేసును ఎత్తివేయాలని నిర్ణయం తీసుకోవడం సంతోషదాయకంగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నర్సుల వ్యథ

(మొదటిపేజీ తరువాయి)

కేటాయింపులో అవినీతికి తెరలేపుతున్నట్లు బాధిత నర్సులు గగ్గోలు పెడుతున్నారు. దీనిపై విచారించాలని ప్రభుత్వానికి, వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు చాలా సార్లు ఫిర్యాదులు వెళ్లినా స్పందించలేదని వాపోతున్నారు. బాధ్యతగల హోదాలో ఉంటూ, ఇలా కింది స్థాయి నర్సుల విధుల కేటాయింపును ఆసరాగా తీసుకుని కానుకలతో విధులు బదలాయిస్తున్నారనే వదంతులు వైద్యారోగ్యశాఖకు మాయని మచ్చలా నిలుస్తున్నాయి. వైద్యారోగ్యశాఖను ప్రక్షాళన చేస్తున్నామంటూ నిత్యం జగన్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసున్నది. అంతకంటే ముందస్తుగా విధుల కేటాయింపు ముసుగులో అవినీతి దందాకు పాల్పడుతున్న వారిపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టి, చర్యలకు ఉపక్రమించాలని బాధితులు కోరుతున్నారు.

మూడు షిఫ్టులుగా నర్సుల విధులు

ప్రభుత్వ, బోధనాస్పత్రులు, ఏరియా తదితర ఆస్పత్రుల్లో రెగ్యులర్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ నర్సులు 20వేల మంది వరకు ఉన్నారు. ఈ నర్సులు ప్రతి రోజూ మూడు షిఫ్టులుగా విధులకు హాజరు కావాలి. ఈ షిఫ్టులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు, 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు ఉంటారు. నర్సుల పర్యవేక్షణ కోసం ఆయా ఆస్పత్రుల పడకల సామర్థ్యానికి అనుగుణంగా అధికారులు విధులు నిర్వహిస్తుంటారు. ఒక్కో టీచింగ్ ఆస్పత్రికి దాదాపు 800 మంది స్టాఫ్ నర్సులు ఉంటారు. అందులో పర్మినెంట్ వారు 500 ఉండగా, మిగిలిన వారిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ నర్సులు విధులు నిర్వహిస్తున్నారు. వారిలో కొందరు నర్సులు విధులకు మొక్కుబడిగా రావడం, వారంతా లైట్ వార్డులు వేసుకుని, పై వారి ఆశీస్సులతో ముందస్తుగా ఇళ్లకు వెళ్లిపోతున్న ఘటనలున్నాయి. ఈ అసమానాతలపై కొందరు నర్సులు నిలదీస్తే, వారు కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

చిరు కానుకలతో విధుల మార్పిడి ?

ప్రభుత్వాసుపత్రిలో కిందిస్థాయి నర్సులకు విధుల నిర్వహణలో సంబంధిత బాధ్యులు పక్షపాతం చూపిస్తున్నట్లు ప్రచారముంది. చిరు కానుకలు, కాసులు తీసుకుని వారికి నచ్చిన విధంగా రోజువారి విధులు కేటాయిస్తూ కక్కుర్తికి పాల్పడుతున్నట్లు సిబ్బంది పేర్కొంటున్నారు. తమకు ముడుపులు ఇవ్వని నర్సులను పనిగట్టుకుని బిజీ బిజీగా ఉండే వార్డుల్లో విధులు వేస్తూ పైశాచిక ఆనందం పొందుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎవ్వరికీ చెప్పుకోలేక వారంతా చాప కింద నీరులా వారంతా నలిగిపోతున్నారు. శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, విజయనగరం, రాజమహేంద్రవరం, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు, తిరుపతి, కడప, విజయవాడ, అనంతపురంలో ఈ దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో కర్నూలులో నాలుగో తరగతి ఉద్యోగుల విధులు రోస్టర్‌లో అవినీతికి పాల్పడిన సంఘటనలు వెలుగు చూశాయి. దీనిపై సమగ్ర విచారణ జరగలేదు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఏసీబీ అధికారులను ఆశ్రయించేందుకు, ఉన్నతాధికారులకు సైతం ఫిర్యాదు చేసేందుకు నర్సులు వెనుకడుగు వేస్తున్నారు. దీనికి కారణం వారి విధుల కేటాయింపులో పెద్దఎత్తున ఒక సిండికేట్ వ్యవస్థ నడవడమే. ఇప్పటికైనా సీఎం జగన్ జోక్యం చేసుకుని నర్సుల విధుల కేటాయింపులో జరుగుతున్న అవినీతి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాలని, రోస్టర్ విధానం ప్రకారం అందరికీ సమాంతరంగా విధులు ఉండేలా చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

ఆ డబ్బు ఎక్కడ?

(మొదటిపేజీ తరువాయి)

నుంచి 7,260 మిలియన్ల నోట్లు మాత్రమే ఆర్బీఐకి చేరినట్లు ఆర్టీఐ నివేదిక తెలిపింది. మిగతా 1,760.65 మిలియన్ల నోట్ల గురించి సమాచారం రిజర్వు బ్యాంకు వద్ద లేదు. 2015, ఏప్రిల్ నుంచి 2016, డిసెంబరు వరకు నాశిక్ ముద్రణాలయంలో 375.450 మిలియన్ల కొత్త రూ.500 నోట్లను ముద్రించగా 345 మిలియన్ల నోట్లు మాత్రమే తమ వద్దకు వచ్చినట్లు ఆర్బీఐ చెబుతోంది. కనిపించకుండా పోయిన 1760.65 మిలియన్ల నోట్లలో 210 మిలియన్ల నోట్లు 2015, ఏప్రిల్ నుంచి 2016, డిసెంబరు వరకు ముద్రించినట్లు తేలింది. 2016, నవంబరులో పెద్ద నోట్లను రద్దు చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఆ తర్వాతే కొత్త నోట్లను తీసుకొచ్చారు. కానీ, ఆర్టీఐ ప్రకారం 2015లోనే ముద్రణాలయాల్లో కొత్త నోట్లను ముద్రించినట్లు తెలుస్తోంది. ఒక వేళ రూ.88,032.5 కోట్ల విలువైన నోట్లు కనిపించకుండా పోయిన విషయం వాస్తవమే అయినాగానీ దీనిపై స్పష్టత రావాల్సి ఉంది. రూ.500 నకిలీ నోట్ల సంఖ్య 14.4శాతం మేర పెరిగినట్లు ఇటీవల విడుదల చేసిన వార్షిక నివేదికలో ఆర్బీఐ వెల్లడించింది. మొత్తం 91,110 నోట్లను గుర్తించినట్లు చెప్పింది. రూ.2వేల నకిలీ నోట్ల సంఖ్య 9,806కి చేరినట్లు పేర్కొంది. రూ.2వేలనోట్లు ఉపసంహరించుకుంటున్నట్లు మే 19న ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే.

బాధ్యత వహించాలి

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు పట్టించుకోకపోవడంతో తనకు ఆత్మహత్యే శరణ్యమని ప్రెస్ యజమాని తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడని గుర్తు చేశారు. అనంతపురంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, రౌడీలు బెదిరించి భూ కబ్జా చేస్తుంటే అధికార పార్టీ వాళ్లు కబ్జాదారులకు కొమ్ముకాయడం వల్ల సామాన్యులు ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. బాపట్లలో 10వ తరగతి విద్యార్థిపై పెట్రోల్ పోసి తగులబెట్టారని, పులివెందుల నియోజకవర్గంలో దళిత యువకుడిని కొట్టి చంపారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి దురాగతాలు జరుగుతుంటే తానేమీ చూడనట్లు, తనకేమీ తెలియనట్లు సాక్షాత్తూ రాష్ట్ర డీజీపీ వితండ వాదం చేస్తున్నారని విమర్శించారు. ఇంత పచ్చిగా అబద్ధాలు, అవాస్తవాలు మాట్లాడుతున్న డీజీపీ స్థాయి పోలీసు అధికారిని ఇప్పుడే చూస్తున్నామన్నారు. పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారని, కేవలం ప్రతిపక్షాలపై నిఘా పెట్టేందుకే పోలీసు వ్యవస్థను వినియోగిస్తున్నారని ధ్వజమెత్తారు. విజయవాడలో టిడ్కో ఇళ్ల కోసం ధర్నా పెడితే విజయవాడ పోలీస్ కమిషనర్ అనుమతి ఇవ్వగా, కార్యక్రమం జరగకుండా డీజీపీ ఆపేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఏనాడూ లేనంతగా శాంతిభద్రతలు దిగజారిపోయాయని, దీనికి ముఖ్యమంత్రి, డీజీపీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో హోం మంత్రిగా మహిళ ఉన్నప్పటికీ నామమాత్రమే అన్నారు. అధికారాలన్నీ కడప జిల్లాకు చెందిన ముఖ్యమంత్రి, ఆయన సలహాదారులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ చుట్టే తిరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూ కబ్జాలు, ఇసుక, మైనింగ్, లిక్కర్ మాఫియాలు పెరిగిపోతున్నాయన్నారు.

ప్రజలపై రూ.50 వేల కోట్ల విద్యుత్ భారాలు

రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక విద్యుత్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, కస్టమర్ చార్జీల పేరుతో దాదాపు రూ.50 వేల కోట్ల విద్యుత్ భారాలు ప్రజలపై మోపారని రామకృష్ణ విమర్శించారు. స్మార్ట్ మీటర్ల పేరుతో మరో రూ.17 వేల కోట్లు భారం మోపేందుకు సిద్ధమయ్యారన్నారు. జూన్ 18వ తేదీ ఆదివారం విజయవాడలో వామపక్ష పార్టీల అధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం జూన్ 20 నుంచి 25 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండలాలు, పట్టణాలు, నగరాలు, నియోజకవర్గాలు, జిల్లా స్థాయిల్లో అఖిలపక్ష, ప్రజాసంఘాల నేతలను ఆహ్వానించి రౌండ్ టేబుల్ సమావేశాలు, చర్చా వేదికలు, సదస్సులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలపై వేసిన విద్యుత్ భారాలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకునేంత వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

వెయ్యి కోట్ల అప్పు కోసం దస్త్రం సిద్ధం

(మొదటిపేజీ తరువాయి)

పరిమితిని మొత్తం ఈలోపే వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. అందువల్లే ఇటీవల రెవెన్యూ లోటు నిధులు పెద్దమొత్తంలో వచ్చినా రిజర్వు బ్యాంకు వద్ద రుణ సేకరణ మాత్రం ప్రతి మంగళవారం క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నట్లు భావిస్తున్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

పరేడ్‌కు రివ్యూయింగ్ అధికారిగా రాష్ట్రపతి వ్యవహరించడం ఇదే మొదటిసారి. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ తమిళిసై, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మంత్రులు సత్యవతి రాథోడ్, సీఎస్, డీజీపీ పాల్గొన్నారు. మొత్తం 119 ఫ్లైయింగ్ ఎయిర్ ట్రైనీ, 75 మంది గ్రౌండ్ డ్యూటీ ట్రైనీ క్యాడెట్లు శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరితో పాటు ఎనిమిది మంది ప్రత్యేక శిక్షణ తీసుకున్నారు. అందులో ఇద్దరు వియత్నాం క్యాడెట్లు, ఆరుగురు నేవీ, కోస్ట్‌గార్డ్‌కు చెందిన క్యాడెట్లు ఉన్నారు.



చెన్నై అడ్డా !

(మొదటిపేజీ తరువాయి)

కల్గుతోంది. కొన్ని బ్యాంకుల్లో అయితే రోజు మొత్తం మీద ఐదారుగురు కూడా రూ.2వేల నోట్లు మార్చుకున్న పరిస్థితులు ఉండడం లేదని సిబ్బంది చెపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆ మాత్రం మార్చుకునేవారూ లేరు. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగంలోని ఉద్దండులు సైతం పెద్దనోట్ల చలామణి పేరుతో జోరుగా వ్యాపారాన్ని సాగిస్తున్నారు. కొందరైతే బహిరంగంగానే తమ ఆస్తులు కొనుగోలు చేస్తే రూ.2వేల నోట్లు తీసుకుంటామని చెపుతున్నారు. తొలుత క్లాసిఫైడ్స్ ప్రకటనల్లో సైతం రూ.2వేల నోట్లు తీసుకుంటామని ప్రకటనలిచ్చారు. అపార్ట్‌మెంట్లు, స్థలాలు, కమర్షియల్ ఆస్తులకు సంబంధించి రూ.2వేల నోట్ల లావాదేవీలు ఎక్కువగా జరుగుతున్నాయి. పెద్దనోట్ల ఎర వేసి వ్యాపారులు మార్కెట్ ధరల కంటే ఎక్కువ రేట్లకు స్థలాలను అమ్ముతున్నారు. కొనుగోలు చేసేవారు కూడా రూ.2వేల నోట్లు పెద్దమొత్తంలో మార్చుకోవడానికి సులువైన మార్గంగా భావిస్తున్నారు. ఇక మద్యం షాపులు, పెట్రోలు బంకుల ద్వారా కూడా రూ.2వేల నోట్లు పెద్దమొత్తంలో చెలామణి అవుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ఐటీ అధికారులు లక్షల్లో టర్నోవర్ చేసే వ్యాపార సంస్థలపై, బంగారు షాపులపై నిఘా విధించి భారీస్థాయిలో పెద్దనోట్లను మార్చే బ్లాక్‌మనీదారులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సహకార రంగంలో రూ.5వేలకోట్ల దోపిడీ

కేంద్ర హోంమంత్రికి, నాబార్డు చైర్మన్‌కు ఫిర్యాదు చేసినట్లు కన్నా వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆంధ్రప్రదేశ్ సహకార రంగాన్ని వైసీపీ ప్రభుత్వం దోపిడీకి అడ్డాగా మార్చుకుందని, కిందిస్థాయి నేతల నుంచి ముఖ్యమంత్రి వరకు రూ.5వేలకోట్లు కాజేశారని రాష్ట్ర మాజీ మంత్రి, టీడీపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. దీనిపై దర్యాప్తు జరిపించాలని కేంద్రహోంమంత్రి అమిత్ షా, ఈడీ, నాబార్డు చైర్మన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అందరికోసం పనిచేయాల్సిన సహకార వ్యవస్థలో జవాబుదారీతనం లేకుండాచేసి, జేబుదొంగలకు అప్పగించారన్నారు. ఇసుకదందాలో ఎలాగైతే పాలెగాళ్లను నియమించి దోచుకుంటున్నారో, అలానే త్రిసభ్య కమిటీలను నియమించి సహకార సంఘాల్లోని సొమ్ముని అధికార పార్టీ నేతలు విచ్చలవిడిగా దోచేస్తున్నారని చెప్పారు. నాబార్డ్, కేంద్రప్రభుత్వం, ఎన్‌సీడీసీలు రైతుల కోసం ఇచ్చే సొమ్ము మొత్తం రాష్ట్రంలో పక్కదారి పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. విచిత్రమేమిటంటే సహకారరంగంలో వందలకోట్ల అవినీతి జరుగుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడన్నారు. కిందిస్థాయి వైసీపీ నేతల నుంచి అధికారులు, ముఖ్యమంత్రికి వాటాలు వెళ్తున్నందునే సహకారరంగంలో దోపిడీ ఎక్కువైందన్నారు. ఏలూరుజిల్లా టీ.నరసాపురం, చింతల పూడి, కామవరపుకోట, రంగాపురం, సరిపల్లి తదితర సొసైటీల్లో సుమారు రూ. 400కోట్ల అవినీతి జరిగిందని, ఏలూరు సెంట్రల్ బ్యాంక్ లో రూ.17కోట్లు అన్యాక్రాంతం అయ్యాయని తెలిపారు. ఏలూరుజిల్లా చింతలపూడి సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, 15సెంట్ల స్థలం తనఖా పెట్టి, 1.5కోట్ల రుణంతీసుకున్నారు. ఇటీవల గుంటూరు సెంట్రల్ బ్యాంక్ లో డ్వాక్రా మహిళలపేర్లుమార్చి రూ.500కోట్లవరకు కాజేసిన వ్యవహారం బయటపడింది. ఇక ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఈ అవినీతి పతాకస్థాయికి చేరిందన్నారు.

ఎంపీ మోపిదేవికి నిరసన సెగ

(మొదటిపేజీ తరువాయి)

ఉంటున్న ఇంటివద్దకు కూడా వెళ్లకుండా అడ్డుకున్నారు. మృతుడి కుటుంబీకులు, బంధువులు గ్రామస్తులు ఎంపీని అడ్డుకుని గోబ్యాక్ గో బ్యాక్ ఎంపీ గో బ్యాక్, నశించాలి రౌడీ రాజ్యం, ఇదేమీ రాజ్యాం ఇదేమీ రాజ్యాం దొంగల, దోపిడి రాజ్యం అంటూ నినాదాలు చేశారు. దోషులను వెంటనే శిక్షించాలని అని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఘటన జరిగిన 24 గంటలు అయిన తరువాత తీరగ్గా ఇప్పుడు వచ్చారా అంటూ గ్రామస్తులు నిలదీశారు. బాధిత కుటుంబానికి నా వంతుగా రూ. లక్ష సాయం అందిస్తానని మోపిదేవి తెలుపగా మరో లక్ష మేమే కలిపి ఇస్తాం ఇక్కడ నుంచి వెళ్లిపోవాలని లేకుంటే ఆగ్రహానికి గురవుతారని ఎంపీని గ్రామస్తులు తీవ్రంగా హెచ్చరించారు. పరిస్థితి తీవ్రరూరం దాల్చుతుండటంతో మోపిదేవి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

నేడు అమర్నాథ్ కుటుంబానికి రామకృష్ణ పరామర్శ

బాలుడు అమర్నాథ్ కుటుంబ సభ్యులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్ ఆదివారం పరామర్శించనున్నట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి చదువుతున్న బాలుడు హత్యకు గురికావటం చాలా బాధకరం అన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలి

- ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు డిమాండ్
- 27 నుంచి గుంటూరులో రాష్ట్ర యువజన విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర కార్యదర్శి నక్కి లెనిన్ బాబు డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ విజయవాడ నగర ముఖ్య కార్యకర్తల సమావేశం దాసరి భవన్‌లో శనివారం ఏఐవైఎఫ్ నగర సహాయ కార్యదర్శి షేక్ అలీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా లెనిన్‌బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ఎన్నికల సమయంలో పాదయాత్రలు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, జాబ్ క్యాలెండర్ ప్రకటనలకే పరిమితమైందని, డీఎస్సీ నోటిఫికేషన్ కోసం లక్షలాది మంది నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 2 లక్షల 35 వేల 794 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 55 వేల ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని కేంద్రం పార్లమెంటులో ప్రకటిస్తే, రాష్ట్రంలో 700 పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని ప్రకటించడం సరికాదన్నారు. జూన్ 27 నుంచి 30 వరకు ఏఐవైఎఫ్ రాష్ట్ర యువజన, విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనం గుంటూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమ్మేళనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల యువజన వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. యువజన సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంకా గోవిందరాజులు, విజయవాడ నగర సహాయ కార్యదర్శులు బెవర శ్రీను, కాళ్ల విజయ్, ఉపాధ్యక్షులు లంకే సాయి, ఐ.ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు చేతివృత్తిదారుల మద్దతు

రాష్ట్రవ్యాప్త ఆందోళన జయప్రదానికి పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: చేనేత కార్మికుల సమస్యలపై సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాలకు చేతివృత్తిదారుల సమాఖ్య సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు సమాఖ్య ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు, కార్యనిర్వాహక అధ్యక్షులు సి.లింగమయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 రకాల చేనేత వస్త్రాలపై రిజర్వేషన్లు అమలు చేయాలని, చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలని, సొసైటీలకు ఆప్కో బకాయిలు చెల్లించాలని, సబ్సిడీలు కొనసాగించాలని, వస్త్రాలపై రిబేట్ ఇచ్చి చేనేత వస్త్రాలపై అమ్మకాలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. చేనేతల ఆందోళన జయప్రదానికి పిలుపునిచ్చారు.

విద్యుత్ చార్జీలపై పోరాడాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కేవలం మతవాదమే అజెండాగా ముందుకు పోతున్నదనీ, రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలపై మోయలేని భారాలను మోపి వీరబాదుడుకు పాల్పడుతోందని, మోదీ, జగన్ ప్రభుత్వాలకు రానున్న ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చెప్పారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఎన్టీఆర్ జిల్లా సమితి సమావేశం జి.కోటేశ్వరరావు అధ్యక్షతన విజయవాడ దాసరి నాగభూషణరావు భవన్‌లో శనివారం జరిగింది. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్ కూడా పాల్గొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ శక్తులకు ఊడిగంచేస్తూ దేశ సంపదను దోచిపెడుతున్నదని విమర్శించారు. దేశ వ్యాప్తంగా అదానీ ఆర్థిక కుంభకోణంపై చర్చ జరిగినప్పటికీ, మోదీ ప్రభుత్వం దానిపై ఎటువంటి విచారణ చేపట్టక పోవడం దుర్మార్గమన్నారు. అబద్ధాలు, అసత్యాలతో బీజేపీ ఏదో ఘనత సాధించినట్లు ప్రచారం చేసుకుంటున్నదని దుయ్యబట్టారు. ఇటీవల కర్నాటకలో ఎన్నికల సందర్భంగా మతవాదాన్ని తెరపైకి తీసుకురాగా కర్నాటక ప్రజలు బీజేపీ వైఖరిని తీవ్రంగా వ్యతిరేకించి, బుద్ధి చెప్పారన్నారు. ఈ నెల 23న బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష పార్టీలు నిర్వహించనున్న సమావేశం జయప్రదం కావాలన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన అస్తవ్యస్తంగా ఉందన్నారు. గత నాలుగు ఏళ్లుగా జగన్ పాలన రివర్స్‌లో నడుస్తోందన్నారు. కనీసం ఒక ప్రాజెక్టు నిర్మాణం కూడా జరగలేదనీ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పరిస్థితి గందరగోళంగా తయారైందన్నారు. రాష్ట్ర విభజన చట్ట ప్రకారం హామీల అమలు, ఏపీకి దక్కాల్సిన నిధుల విషయంలో కేంద్రంపై జగన్ సర్కార్ ఒత్తిడి పెంచడంలో విఫలమైందన్నారు. ఏపీలో పోర్టులు, విద్యుత్ ఒప్పందాలు అదానీ కంపెనీకే అప్పనంగా కట్టబెట్టారని విమర్శించారు. పెంచిన విద్యుత్ చార్జీలు, స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా జూన్ 20 నుంచి 25 వరకు జిల్లాలలో వివిధ స్థాయిల్లో జరుగనున్న రౌండ్‌టేబుల్ సమావేశాలు, చర్చావేదికలు, సదస్సులు జయప్రదం చేయాలని, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్. కోటేశ్వరరావు కార్యకలాపాల నివేదిక ప్రవేశపెట్టి, భవిష్యత్ కర్తవ్యాలను వివరించారు. పేదల సాగులో ఉన్న భూములకు పట్టాల సాధన కోసం పార్టీ నడుం కట్టాలన్నారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జాతీయ, రాష్ట్ర పార్టీలు ఇచ్చే పిలుపులతో పాటు జిల్లాలో ఎక్కడికక్కడ స్థానికంగా ఉన్న సమస్యలపై, టిడ్కో ఇళ్ల సాధనకుపోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి దోనేపూడి శంకర్ తదితరులు మాట్లాడారు.

నిరుద్యోగుల సమస్యలు సీఎంకు పట్టవా?

పరుచూరి రాజేంద్ర బాబు

విశాలాంధ్ర -భీమవరం: రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలు ముఖ్యమంత్రికి పట్టవా అని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్ర ప్రశ్నించారు. నిరుద్యోగ యువతను ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నమ్మించి మోసం చేశారని విమర్శించారు. ఏఐవైఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం భీమవరంలోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో వైఎఫ్ జిల్లా అధ్యక్షులు కొడవర్తి రమేష్ అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో రాజేంద్ర మాట్లాడుతూ, ఈ నెల 27 నుంచి 30 వరకు గుంటూరులో జరిగే రాష్ట్ర యువజన విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో పాదయాత్రలు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తాము అని చెప్పి నాలుగేళ్లు గడిచినా నేటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని, జాబ్ క్యాలెండర్ ప్రకటనలకే పరిమితమయ్యిందన్నారు. సీపీఐ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు కూడా మాట్లాడారు.

తెలంగాణ తరహాలో

ఎకరాకు రూ.10 వేలు సాగు సాయం

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: సాగుకు తెలంగాణ రాష్ట్రం మాదిరిగా ఎకరానికి రూ.10వేలు పెట్టుబడి సాయం అందించాలని, రెండు ఎకరాల వరకు సాగుచేస్తున్న ప్రతిరైతుకు రూ.20వేలు చెల్లించాలని, రెండు ఎకరాల పైబడి సాగుచేస్తున్న రైతులకు ఎకరాకు రూ.10వేల వంతున సాయం అందించాలని, వాస్తవ సాగుదారులైన ప్రతి కౌలురైతును సాగు సాయం పథకంలో భాగస్వామ్యం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఇక్కడి దాసరి భవన్‌లో శనివారం సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రైతులు అప్పుల్లో కూరుకుపోయారని చెప్పారు. ఏపీలో ప్రతి రైతు 2 లక్షల 45 వేల రూపాయల అప్పుల భారంతో కృంగిపోతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రైతు, కౌలు రైతులకు ఒక్క పర్యాయం అన్ని రకాల పంటల రుణాలను మాఫీ చేయాలని, కేరళ తరహా రుణ ఉపసంహరణ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన పంటలకు ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర దక్కటం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలకు కూడా కొనే దిక్కు లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంటల సేకరణ సక్రమంగా లేదని ఈ అంశాలను దృష్టిలోపెట్టుకొని అన్ని పంటలకు స్వామినాధన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. రానురాను సాగు ఖర్చులు పెరిగి వ్యవసాయం భారంగా మారుతున్నదని అన్ని రకాల ఇన్‌పుట్స్, ఉపకరణల ధరలు పెరిగాయని చెప్పారు. ఈ భారం నుండి బయటపడటానికి గ్రామీణ ఉపాధి పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోరుతుందన్నారు. 50 సంవత్సరాలు పైబడిన రైతు, కౌలు రైతుకు ప్రతినెల 10 వేలు పెన్షన్ అందించాలన్నారు.

ఐక్యతతో ఉద్యమిస్తాం

- ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి
- తక్షణమే డిపాజిట్లు చెల్లించాలి
- అగ్రిగోల్డ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల

విశాలాంధ్ర బ్యూరో-నెల్లూరు: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఐక్యతతో ఉద్యమిస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అగ్రిగోల్డ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వరరావు హెచ్చరించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ అసోసియేషన్ నెల్లూరు జిల్లా కమిటీ అధ్వర్యంలో నెల్లూరులోని కేపీఆర్ కళ్యాణ మంటపంలో శనివారం రాజకీయ పార్టీల, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ముప్పాళ్ల మాట్లాడుతూ అగ్రిగోల్డ్ యాజమాన్యం ప్రజలను వివిధ రూపాల్లో నమ్మబలికి వేల కోట్లను దోచుకుందని, ఆ సొమ్మును బినామీ పేర్లతో దాచుకుందని విమర్శించారు. గత 9 సంవత్సరాలుగా బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ అసోసియేషన్ అధ్వర్యంలో నిరంతరాయంగా ఉద్యమాలు నిర్వహించామన్నారు. ఆ పోరాటాల ఫలితంగా సుమారు రూ.20 వేల లోపు డిపాజిట్ చేసిన కొందరి బాధితులకు సుమారు రూ.906 కోట్లను సాధించుకున్నట్లు తెలిపారు. ఇంకా రూ.20 వేల లోపు చేసిన డిపాజిట్ దారులు సుమారు మూడున్నర లక్షల మంది పైగా ఉన్నారని అన్నారు. రూ.20 వేల పైన డిపాజిట్ చేసిన బాధితులు ఆరున్నర లక్షల మంది ఉన్నారని, వీరందరికీ సుమారు రూ.3 వేల 80 కోట్ల మొత్తం రావాల్సి ఉందని చెప్పారు. గత ఎన్నికల ప్రచారం సందర్భంగా తమ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించేలా చర్యలు చేపడతానని జగన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అటుతర్వాత బాధితులకు సుమారు 6 మాసాలలో డిపాజిట్లు మొత్తం చెల్లిస్తామని గతంలో సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఇచ్చిన హామీని నెరవేర్చకపోగా, ప్రభుత్వం ఏర్పడి సుమారు 5వ సంవత్సరం ప్రారంభమైందని విమర్శించారు. ఇప్పటికే సుమారు 9 సంవత్సరాల నుంచి బాధితులు తీవ్ర మనోవేదనతో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల పెళ్లిళ్లకు, చదువులకు, సొంత ఇల్లు నిర్మించుకునేందుకు తదితర ఆలోచనలతో అగ్రిగోల్డ్‌లో జమ చేసుకున్నారని తెలిపారు. తీరా దాచుకున్న నగదు చేతికి అందకపోవడంతో బాధితులు మనోవేదనతో అనారోగ్యాల బారిన పడుతున్నారని, అనేక మంది ప్రాణాలు సైతం విడిచారని అన్నారు. వేల కోట్ల రూపాయలు అగ్రిగోల్డ్ యాజమాన్యాలకు ఆస్తులు ఉన్నాయని కంపెనీ చైర్మన్ గతంలో ప్రకటన చేశారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు ఆస్తులను అమ్మి బాధితులకు ఎందుకు డిపాజిట్లను ఇవ్వలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జులై ఆఖరులోపు బాధితులకు ప్రభుత్వం డిపాజిట్లు చెల్లించేలా చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆగస్టులో రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

బాధితులకు న్యాయం చేసేలా మేనిఫెస్టో: ఎమ్మెల్యే కోటంరెడ్డి

రానున్న ఎన్నికల్లో టీడీపీ తరఫున అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేలా, మేనిఫెస్టోలో పెట్టేలా తమ నేతలకు విన్నవిస్తానని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హామీ ఇచ్చారు. బాధితులు ఇప్పటికే అగ్రిగోల్డ్ సంస్థలో దాచుకున్న నగదు చేతికందక ఆవేదనలో ఉన్నారని, వీరందరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపడతానని తెలిపారు. సీపీఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి దామ అంకయ్య మాట్లాడుతూ సత్వరమే అగ్రిగోల్డ్ బాధితులకు డిపాజిట్లు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే పోరాటాలు ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ సుమారు ఎనిమిది రాష్ట్రాలలో అగ్రిగోల్డ్ బాధితుల ఉన్నారని, వీరందరికీ ప్రభుత్వ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.తిరుపతిరావు మాట్లాడుతూ అనేక మంది అధికారులు, నాయకులు అగ్రిగోల్డ్ బాధితులేనని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో సుమారు 5 వేల కుటుంబాలు బాధితులు ఉన్నారని తెలిపారు. తమ అసోసియేషన్ అధ్వర్యంలో ఆందోళన నిర్వహించగా బాధితుల పక్షాన ఉంటామని చంద్రబాబు గతంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం బాధితులకు న్యాయం చేసి ఆదుకోవాలని కోరారు. టీడీపీ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ బాధితుల అంశం పెట్టేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫయాజ్ మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితులకు తమ పార్టీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సిరాజ్, షాన్వాజ్, నంది పోగుల రమణయ్య ఏఐవైఎఫ్ నాయకులు మున్నా, సీపీఐ రూరల్ మండల సహాయ కార్యదర్శి ఆదినారాయణ, జనసేన నాయకులు సందీప్, పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ఎస్.వేణుగోపాల్, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి జి.వి.ప్రసాద్, నాయకులు డాక్టర్ రామదాస్ సుధీర్, సుబ్రహ్మణ్యంతో పాటు అనేక మంది ఏజెంట్లు, బాధితులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్టోబరు 2 నుంచి 'ఆడుదాం ఆంధ్ర'

క్రీడా సంబరాలకు కార్యాచరణ సిద్ధం చేయాలి: సీఎస్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2 నుంచి 'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభానికి సర్వం సిద్ధం చేయాలని అధికారులను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్ జవహర్ రెడ్డి ఆదేశాలిచ్చారు. 2023-28 క్రీడా విధానంపై శనివారం విజయవాడలోని సీఎస్ క్యాంపు కార్యాలయంలో వీడియో సమావేశం నిర్వహించారు. జవహర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలను విజయవంతంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. గ్రామ, మండల స్థాయిల్లో అనువైన క్రీడా ప్రాంగణాలు, మైదానాలను గుర్తించి వాటిని వివిధ క్రీడల నిర్వహణకు వీలుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యే విధంగా యువతను ప్రోత్సాహించాలని సూచించారు. 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీల్లో భాగంగా క్రికెట్, బాడ్మింటన్, వాలీబాల్, కోకో, కబడ్డీతో పాటు ఇతర సాంప్రదాయ క్రీడలను నిర్వహించేలా కార్యాచరణను సిద్ధం చేయాలని సీఎస్ సూచించారు. ప్రతిభగల క్రీడాకారులను ప్రోత్సాహించేలా నూతన క్రీడా విధానం ఉండాలన్నారు. సమావేశంలో రాష్ట్ర క్రీడలు, యువజన సేవలశాఖ ముఖ్య కార్యదర్శి వాణీ మోహన్, ఆర్థికశాఖ కార్యదర్శి ఎన్.గుల్జార్, సీఎం కార్యదర్శి ఆర్.ముత్యాల రాజు, క్రీడా ప్రాధికార సంస్థ వీసీ, ఎండీ కె.హర్షవర్ధన్ హాజరుకాగా, వీడియో లింక్ ద్వారా ప్రముఖ క్రికెటర్ అంబటి రాయుడు, కేఎస్ భరత్ పాల్గొన్నారు.

కమ్యూనిస్టు నేత మంగాయమ్మ మృతి

- పార్టీకి తీరని లోటు: జల్లి విల్సన్
- భౌతిక కాయం పిన్నమనేని ఆసుపత్రికి అప్పగింత

విశాలాంధ్ర-విజయవాడ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మలికిపురం మండలం దిండి గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు అమరజీవి దేవ ముసలయ్య సతీమణి దేవ మంగాయమ్మ (83) శనివారం ఉదయం ఇక్కడ మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆంధ్రా హాస్పటల్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంగాయమ్మ సుదీర్ఘ కాలం గోదావరి జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయులుగా పని చేశారు. రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంలో కీలక పాత్ర పోషించారు. ఉద్యోగ విరమణ తర్వాత మహిళా సమాఖ్య నాయకులుగా కమ్యూనిస్టు పార్టీలో చురుకైన పాత్ర పోషించారు. భర్త దేవ ముసలయ్య వ్యవసాయ కార్మిక సంఘం నాయకునిగా పని చేసి ఆరేళ్ల క్రితం మరణించారు. అనారోగ్య కారణంగా నగరంలోని కుమార్తె డాక్టర్ సుజాత ఇంటి వద్దనే ఉంటున్నారు. వృద్ధాప్యం అనారోగ్యం కారణంగా కొద్ది రోజులుగా హాస్పిటలలో చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు. ఆమె నేత్రాలను ఎల్వీ ప్రసాద్ నేత్ర నిధి బ్యాంకుకు, భౌతిక కాయాన్ని అవుటుపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్య కళాశాలకు వైద్య పరిశోధన నిమిత్తం కుటుంబ సభ్యులు అప్పగించారు. మంగాయమ్మ మృతి సమాచారాన్ని తెలుసుకున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బుట్టి రాయప్ప ఆసుపత్రికి వెళ్లి మంగాయమ్మ భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ దేవ మంగాయమ్మ కమ్యూనిస్టు పార్టీ ఆశయాల సాధనకు తీవ్రంగా కృషి చేశారని తెలిపారు. పిల్లలందరినీ పార్టీ కుటుంబంగా తీర్చిదిద్దాని చెప్పారు. ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. మంగాయమ్మ కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆమె భౌతికకాయం పై సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెన్మెత్స దుర్గాభవాని ఎర్ర జెండా కప్పారు. మంగాయమ్మ కుమార్తె డాక్టర్ దేవ సుజాత, అల్లుడు డాక్టర్ సదానందం, కుమారులు రాజేంద్ర, రాధకృష్ణ, మనుమరాలు వెన్నెల, డాక్టర్ విజ్ఞేష్ పిన్నమనేని హాస్పటల్‌కు వెళ్లి మంగాయమ్మ భౌతిక కాయాన్ని ఆసుపత్రి యాజమాన్యానికి అప్పగించారు. అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య, సీపీఐ సీనియర్ నాయకులు వై.చెంచయ్య, విశ్రాంత ఆచార్యులు సి. నరసింహారావు సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, నాయకులు నక్కా వీర భద్రరావు, మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ , ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు పీవీ సుందర రామరాజు, సీనియర్ న్యాయవాది ఏ ఎస్ ఎస్ రామ్ ప్రసాద్, మానసిక వైద్యులు శ్రీనివాసరాజు , సామాజిక కార్యకర్తలు అరుణకుమార్, వేణుగోపాల్ రాజోలు ప్రాంత కమ్యూనిస్టు పార్టీ నాయకులు వై వెంకట్, పి ఆనంద్ మంగాయమ్మ కుటుంబ సభ్యులు బంధువులు ఆమె భౌతిక కాయాన్ని కడసారి సందర్శించి నివాళులు అర్పించారు.

నేడు సంస్మరణ సభ

దేవ మంగాయమ్మ సంస్మరణ సభ 18వ తేదీ ఆదివారం సాయంత్రం విజయవాడ సూర్యారావుపేట కాళేశ్వరరావు రోడ్డులోని వెన్నెల స్కాన్ సెంటర్ వద్ద జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

స్వాతంత్ర్య సమరయోధులకు అవమానం

నెహ్రూ మ్యూజియం పేరు మార్పుపై జంగా గౌతమ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ రాజధాని ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ మ్యూజియం పేరును మార్చడాన్ని కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగా గౌతమ్ ఖండించారు. మోదీ ప్రభుత్వ తీరును ఆక్షేపించారు. నెహ్రూ పేరును తొలగించడం అంటే స్వాతంత్ర్య సమరయోధులను అవమానించడమే కాకుండా దేశ మహోన్నత చరిత్రను కళంకితం చేయడమేనని బీజేపీ, మోదీ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ స్వాతంత్ర్యం కోసం తొమ్మిదేళ్లకు పైగా జైల్లో ఉండి, రాజ్యాంగ రూపకల్పనలో క్రియాశీలంగా ఉండి, 16ఏళ్లకు పైగా ప్రధానిగా సేవలందించి, దేశాన్ని ఆధునికంగా తీర్చిదిద్దిన మహనీయుడు నెహ్రూ అని కొనియాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఎలాంటి పాత్ర లేకుండా, బ్రిటీష్ వారికి మద్దతిచ్చిన ఆరెస్సెస్ శక్తులు దేశ చరిత్రను మార్చాలని కుట్ర చేస్తున్నాయని, తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నాయని దుయ్యబట్టారు. గాంధీ, నెహ్రూ, ఇందిర లాంటి మహనీయుల చరిత్రను చెరిపివేసే మోదీ యత్నాలు గర్హనీయమన్నారు. బీజేపీ, మోదీ కుట్రలను తిప్పికొట్టాలని మేధావులు, చరిత్రకారులు, ప్రజాస్వామ్యవాదులను జంగా గౌతమ్ కోరారు.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION

Expression of Interest (EOI) Short Tender Notice

Rc No. 335/2023/F7/PH/CVO Dt. 16.06.2023

1. **Name of the work :** Inviting EOI from Experienced NGO/Society/Trust to Provide food on daily basis & to look after the maintenance & welfare measureas of dogs at Narava Centre, Zone.VI. GVMC
2. **Sources Provided From GVMC :** Shelter, Water facility, Electricity facility at Navara Center and also Providing Veterinary Medical Assistance duly Conduction the ABC Surgeries under the supervisiong of CVO/VAS.
3. **Document Submission Starting Date : 19.06.2023 @ 11.00 AM**
4. **Last Submission date : 26.06.2023 @ 3.30 PM**
5. **Date of Opening Tenders : 26.06.2023 @ 04.00 PM**

Further Details at Address/ E-Mail ID:- gvmcpublichealth@gmail.com
Contact Details:- OFFICE CVO.GVMC Room No. 210, Land line No. 0891-2746301-05, Ext PH Section/9848308823, 8886338111

For Commissioner, GVMC

సంపాదకీయం

తప్పు దిద్దుకున్న తెలంగాణ ప్రభుత్వం

పౌర హక్కుల కోసం పాటుపడే ప్రొఫెసర్, పేదల కోసం పనిచేసే న్యాయవాది సుధా భరద్వాజ్, ఉస్మానియా విశ్వ విద్యాలయంలో పని చేసిన పద్మజా షాతో సహా 152 మంది మీద 1967 నాటి చట్ట వ్యతిరేక కార్యకలాపాల చట్టం (ఉపా) కింద నమోదుచేసిన కేసులను వెంటనే ఉపసంహరించు కోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు (కె.సి.ఆర్.) నిర్ణయించడం కొందరు పాలకులు ప్రజల కష్ట నష్టాలను కూడా అప్పుడప్పుడైనా పట్టించుకుంటారని రుజువైంది. ఈ కేసులను తక్షణం ఉపసంహరించాలని ఆయన రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ అంజనీ కుమార్‌ను ఆదేశించినందుకు అభినందించ వలసిందే. అయితే ఎప్పుడూ అధికారంలో ఉండే వారి కనుసన్నల్లో నడుచుకునే పోలీసు ఉన్నతాధికారులు స్వతంత్రంగా పనిచేసే స్వల్ప అవకాశం కూడా ఎక్కడో ఒకచోట ఉంటుందని అనిపిస్తోంది. హరగోపాల్ మొదలైన వారిమీద కేసు నమోదు చేయడం, దానిమీద వివిధ వర్గాలనుంచి గగ్గోలు మొదలైన తరవాత ఉపసంహరించాలని ముఖ్యమంత్రి కె.సి.ఆర్ ఆదేశించడం విశేషమే. మావోయిస్టు కార్యకలాపాలకు సహకరిస్తున్నారన్న ఆరోపణలపై హరగోపాల్‌తో పాటు ఇతర ప్రజాసంఘాల నేతలపై "ఉపా" చట్టం కింద తెలంగాణ పోలీసులు పదినెలల కింద కేసునమోదు చేశారట. అయితే ఈ విషయం గత శుక్రవారం దాకా హరగోపాల్‌కు ఇతరులకు తెలియక పోవడం విచిత్రం. ఈ కేసులో ఉన్న హరగోపాల్, సుధా భరద్వాజ్ లాంటి వారు పౌరుల హక్కులకోసం నిరంతరం పాటు పడ్తుంటారు. వారికి నిషేధంలో ఉన్న మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఉన్నాయో లేవో అన్నది ఎప్పటికీ బ్రహ్మ రహస్యమే. వారిలో కొందరికీ మావోయిస్టు ఆలోచనా ధోరణి మీద, ఆ సిద్ధాంతం మీద నమ్మకం ఉండొచ్చు. కానీ ఏ అభిప్రాయాలున్నా ఆ భావాల వల్ల సమాజానికి నష్టం కలగ నంతవరకు, ఇతరులను హింసకు రెచ్చగొట్టనంతవరకు అది శిక్షార్హమైన నేరం ఏమీకాదు. భావాలు ఉండడం వాటిని ప్రకటించడం రాజ్యాంగం పూచీ పడ్డ భావప్రకటనా స్వేచ్ఛ కిందకు వస్తుంది. ములుగు జిల్లా తాడ్వాయి పోలీసుస్టేషన్ వారు 2022 ఆగస్టు 19న ఈ కేసు నమోదు చేశారు. ఈ విషయం బయటపడ్డది మాత్రం గత గురువారమే. ఇదే కేసులో ఉన్న పీపుల్స్ డెమోక్రాటిక్ మూవ్‌మెంట్ (పి.డి.ఎం.) అధ్యక్షుడు చంద్రమౌళి రంగారెడ్డి జిల్లా కోర్టును బెయిలు కోసం ఆశ్రయించినప్పుడు మాత్రమే హరగోపాల్ లాంటి వారి మీద "ఉప" చట్టం కింద కేసుఉందని బయట పడింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం, దేశద్రోహ చట్టం లాంటివి చాలా కిరాతకమైన చట్టాలు. వీటిని దేశమంతా దుర్వినియోగం చేస్తూనే ఉన్నారు. ఇలాంటి కఠిన చట్టాలను ఎత్తివేయాలని పౌర సమాజంలోని వారు, న్యాయవాదులు, రాజకీయ పార్టీలవారు, పౌరహక్కుల కార్యకర్తలు ఎప్పటినుంచో కోరుతున్నారు. కానీ ఏ ప్రభుత్వమూ ఇంతవరకు ఈ చట్టాలను ఉపసంహరించిన దాఖలాలు లేవు. అవసరమైనప్పుడు రాజకీయ ప్రత్యర్థులమీద ఈ కేసులు మోపి బెదరగొట్టవచ్చునన్న ఆలోచన దాదాపు అన్ని రాజకీయ పార్టీలలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. హరగోపాల్ మొదలైన వారి మీద మోపిన నిరాధారమైన ఈ కేసును ఎత్తివేయాలని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ఇప్పుడూ విజ్ఞప్తి చేశాయి. గతంలోనూ విజ్ఞప్తి చేస్తూనే ఉన్నాయి. ప్రత్యర్థులను అణచి వేయడానికి ఇలాంటి కర్కస చట్టాలు ఎప్పుడో ఒకప్పుడు అవసరానికి ఉపయోగ పడతాయన్న దుష్ట చింతన అధికారంలో ఉన్నవారికి ఉంటూనే ఉంది. అయినప్పటికీ కె.సి.ఆర్. జనం గోదువిని కేసులు ఉపసంహరించాలని ఆదేశించడం ఆయన అప్పుడప్పుడైనా జనవాణి వినే ఓపిక చేసుకుంటారని రుజువైంది.

పి.డి.ఎం. అధ్యక్షుడు రంగారెడ్డి కోర్టుకు వెళ్తే ఈ ఉదంతంలో ఆయన మీద ఉన్న ఎఫ్.ఐ.ఆర్.లను అందజేయాలని కోర్టు కోరింది. అందులో హరగోపాల్, సుధా భరద్వాజ్, పద్మజా షాతో పాటు మొత్తం 152 మంది పేర్లు ఉన్నట్టు తెలిసింది. ఈ కేసులో తెలంగాణ పౌర హక్కుల కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఉద్యోగ విరమణ చేసిన న్యాయమూర్తి హెచ్. సురేశ్, మానవ హక్కుల కోసం పోరాడే సురేంద్ర గాడ్లింగ్, సామాజిక కార్యకర్త అరుణ్ ఫెరీరా పేర్లు కూడా కనిపించాయి. వీరిలో కొద్ది మంది భీమా కోరేగావ్ కేసులో కూడా నిందితులు. ఉదాహరణకు భీమా కోరేగావ్ కేసులో నిందితురాలిగా ఉన్న సుధా భరద్వాజ్ బెయిలు మీద ఉన్నారు. పోలీసులు రాజును మించిన రాజభక్తితో హడావుడిగా కేసులైతే నమోదుచేశారు కానీ ఎవరి మీదైతే కేసులు మోపారో వారికి కనీసం ఈ విషయం తెలియజేయనైనా లేదు. కనీసం పది సెక్షన్ల ఆధారంగా ఈ కేసులు నమోదైనాయి. ఈ కేసులు నమోదుచేసిన పోలీసు సర్కిల్ ఇన్స్పెక్టర్ వి.శంకర్ చెప్పిన వివరాలు మరింత ఆశ్చర్యకరంగా ఉన్నాయి. 2022 ఆగస్టు 19న సీపీఐ (మావోయిస్టు) సమావేశం చట్టవ్యతిరేకంగా జరుగుతున్నట్టు సమాచారం అందిందట. ఈ చట్ట వ్యతిరేక, రహస్య సమావేశానికి బడే చొక్కారావు, కంకణాల రాజిరెడ్డి, కోయడ సాంబయ్య, కుర్సంమగ్గు, మడకం సన్నల్, కుంజా వీరయ్య, కొవసి గంగ, ముచకి ఉంగల్, జమున, రోషన్‌తో పాటు ఇతర కార్యకర్తలు కూడా హాజరవుతారన్న సమాచారం సదరు పోలీసు అధికారికి ఉందట. అందిన సమాచారంమీద ఎలాంటి దర్యాప్తు లేకుండా పోలీసులు కేసులుమోపడం వారి స్వామి భక్తికి మాత్రమే నిదర్శనం. ఆ రహస్య సమావేశం జరిగిందో లేదో, ఆ సమావేశం చట్ట వ్యతిరేకమైంది, రహస్యమైంది కనక హాజరైనవారి మీద ఏం చర్య తీసుకున్నారో, ఏ కేసులు మోపారో మాత్రం తెలియదు. ఈ రహస్య సమావేశం గురించి ఉప్పందిన తరవాత సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకర్, కొంతమంది పోలీసు అధికారులతో కలిసి తాడ్వాయిలోని ఆశన్న గుడ, ఎల్లాపూర్ వెళ్లారట. వారికి అక్కడ ఆకుపచ్చని దుస్తులు ధరించి ఉన్నవారు కనిపించినందువల్ల వారు మావోయిస్టులని గుర్తించారట. షరా మామూలుగా లొంగిపొమ్మని హెచ్చరిస్తే మావోయిస్టులనుకునే వారు అడవుల్లో అంతర్ధానం అయిపోయారట. ఒకవేళ ఎవరైనా కాల్పుల్లో మరణించినా, లేదా బూటకపు ఎన్‌కౌంటర్ చేసినా దానికి తగ్గ కథ పోలీసుల దగ్గర ఎటూ సర్వదా సిద్ధంగా ఉంటుంది. హరగోపాల్ లాంటి వారి మీద కేసుమోపడాన్ని సీపీఐ సహా అనేక రాజకీయ పక్షాలు ఈ కుహనా కేసును ఎత్తివేయాలని కోరారు. అందుకే కె.సి.ఆర్. స్పందించినట్టున్నారు. మొత్తం మీద దుర్మార్గమైన చట్టాలను దుర్వినియోగం చేయడానికి పోలీసులు ఎంత అత్యుత్సాహం ప్రదర్శించినా కేసులు ఉపసంహరించాలని ఆదేశించి కె.సి.ఆర్. బోలెడు మంచి మార్కులు కొట్టేశారు.

కమ్యూనిస్టుల ఐక్య సంఘటన అవశ్యం

ఘనచరిత్ర గల ఆంధ్రప్రదేశ్ నేడు అసమర్థ సంతానపు అనాథ తల్లిగా తల్లడిల్లుతోది. కమ్యూనిస్టులు అరణ్యవాసాలు, అజ్ఞాతవాసాలూ ఇక చాలించాలి. దాయాది ఆలింగనలు, దాగుడుమూతలు కట్టిపెట్టాలి. తాము సంఘటితమై సొంత వ్యక్తిత్వంతో ప్రత్యక్షంగా రంగంలోకి దిగాల్సిన తరుణం వచ్చింది. ముందు నిలిచింది. ఇది నిస్పష్టమైన సందర్భం. పాలకవర్గ రాజకీయ పార్టీలకి నిజమైన ప్రత్యామ్నాయ ప్రజా ఉద్యమానికి భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ), భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్ట్) (సిపిఐఎం) నడుం కట్టాలి. ఈ పార్టీలే బాధ్యత తీసుకొని చొరవ చేయాలి. వీరితో కలిసి నిలిచేందుకు మరికొన్ని కమ్యూనిస్టు గ్రూపులు బహిరంగంగానే తమ సమ్మతిని ప్రకటిస్తున్నాయి. పాలకపార్టీల నిజరూపాన్ని అర్థంచేసుకున్న దళిత, బహుజన సంఘాలు ముందుకొస్తున్నాయి. కమ్యూనిస్టులారా ఆంధ్రదేశం సర్వనాశనం అవుతున్నాకూడా అనవసరపు పట్టుదలలను పట్టుకు వేలాడకండి. ఆ మత్తు ఉన్మత్తాల నుండి బైటపడండి. ఇది ప్రజల, కమ్యూనిస్టు ఉద్యమ శ్రేయోభిలాషుల డిమాండు. జనం కోసమే సిద్ధాంతాలు, వ్యూహాలు, ఎత్తుగడలు ఉండాలి. కాకుంటే పిడివాదం అవుతుంది. అలా పిడివాదులుగా చరిత్రలో శాశ్వతత్వాన్ని పొందకండి. ఇప్పుడైనా ఆంధ్ర రాష్ట్రంలో వామపక్ష ప్రజాస్వామ్య సంఘటనకు నడుంకట్టండి. ఒకప్పుడు భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ఆంధ్ర కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అగ్రగామిగా నిలిచింది. కష్టజీవుల అసమాన త్యాగాలతో శ్రామిక పతాకకు అరుణిమను అద్దింది. నేడు ఆ కష్టజీవుల ఆత్మగౌరవాన్ని పాలక పార్టీల నాయకులు కొల్లగొడుతున్నారు. దొరల అహంభావ, అవినీతి అక్రమాలు, హింసా దౌర్జన్యాలతో అధోగతిపాలైన ఆంధ్ర రాష్ట్రంలో శ్రామిక జన ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభించండి. సంపదను సృష్టించే కష్టజీవుల శ్రమ ఫలితాన్ని కొల్లగొట్టి వారినే అభాగ్యులు, ఉచిత పథకాల కోసం దేబిరించే బిచ్చగాళ్ళు, అశక్తులుగా చిత్రిస్తున్నారు. తామేదో దానకర్ణులైనట్టు పాలకవర్గ పార్టీల అధినేతలు పోజులు పెడుతున్నారు. ఈ కపట నాటకాన్ని బద్దలుకొట్టగల నిజమైన శక్తిమంతులు కమ్యూనిస్టులే.

కందుకూరి వీరేశలింగం సంఘ సంస్కరణ, త్రిపురనేని రామస్వామి హేతువాద ఉద్యమాలు కమ్యూనిస్టుపార్టీ వర్గ పోరాటంతో పదునెక్కిన ఆంధ్రజాతి చైతన్యం నేడు మొద్దుబారింది. బండబారింది. మూఢనమ్మకాలు, అమానుష కుల,మత ఉన్మాదం తలకెక్కి విలయ తాండవం చేస్తున్నాయి. వైద్య, ఇంజనీరింగ్, ఐఏఎస్, ఐపిఎస్, అధ్యాపక చదువులు వృత్తి చదువులుగా పరిమితమయ్యాయి. మానవ విజ్ఞాన ప్రతీకలుగా నిలవలేకపోతున్నాయి. కారణం పాలకవర్గాలు వాటిని ఆమేరకు నిస్సారంగా మార్చేశాయి. ఇది ఏదో పొరపాటు అని సమర్థించేందుకు, సరిపెట్టుకునేందుకు ఏమాత్రం వీలులేదు. అందులో దుర్మార్గమైన దాని వర్గ ప్రయోజనమే ఇమిడిఉంది. పూర్తి స్పృహతోనే విద్యావ్యవస్థను, దానిలో పరిమళించాల్సిన జ్ఞానాన్ని మానవీయ పార్శ్వాన్ని పాలక పక్షం ధ్వంసం చేసింది. ఇంకా ఇంకా చేస్తోంది. దీనిని ప్రతిఘటించగల ఏకైకశక్తి మానవత్వం తొణికిసలాడే కష్టజీవుల సిద్ధాంతం మార్క్సిజం మాత్రమే. అది తిరిగి పునఃప్రతిష్ఠితం కావాలంటే కమ్యూనిస్టు ఉద్యమం ఊపందుకోవడమే ఏకైక మార్గం. ఆ ఉద్యమ శక్తిని కమ్యూనిస్టులు తిరిగి సంతరించుకోవాలంటే కమ్యూనిస్టు ఐక్య సంఘటనే శాస్త్రీయ మార్గం. అట్టడుగు, బడుగు, బలహీన వర్గాలకు ప్రాతినిధ్యం వహించే కార్మికవర్గ నాయకత్వమే అందుకు అర్హమైనది. అప్పుడే జనశ్రేణుల్లో ఆత్మగౌరవ స్పృహ మేల్కొంటుంది. దానికి ఉద్యమ రూపాన్ని ఇస్తుంది. పోరాట శక్తిని ఇస్తుంది.

దీనంతటి సారం ఒక్కటే. అదేమంటే కమ్యూనిస్టుల ఐక్య సంఘటన అత్యావశ్యకతే. కమ్యూనిస్టు ఉద్యమ విచ్ఛిన్నత వల్ల జరిగిన చారిత్రక తప్పిదాన్ని సరిదిద్దుకునే మరొక అవకాశం కమ్యూనిస్టుల కళ్లెదుట నిలిచింది. దానిని అందిపుచ్చుకొని కమ్యూనిస్టుల్లో వర్గ స్పృహ, సైద్ధాంతిక అవగాహన, సామాజిక న్యాయంలో నిబద్ధత ఇంకా మిగిలి ఉన్నాయని చాటండి. కమ్యూనిస్టులు పతితులు, భ్రష్టులు, బాధా సర్పదష్టులు, సకల కష్టజీవుల ప్రతినిధులని చాటండి. ఆంధ్రుల నిజమైన ఆత్మగౌరవాన్ని నిలపండి. పాలక వర్గ పార్టీలు చెప్పేది ఊహాజనిత ఆత్మగౌరవం. అది వారికి అధికారాన్ని కట్టబెట్టే ముఖ్య సాధనాల్లో ఒకటి మాత్రమే. కమ్యూనిస్టులు నిలబెట్టేది సమస్త ప్రజానీకపు నిజమైన ఆత్మగౌరవం. కమ్యూనిస్టుల ఐక్య సంఘటన రూపొందాలి! అయిదు కోట్ల ఆంధ్రుల నిజమైన ఆత్మగౌరవాన్ని నిలబెట్టాలి!!

కె. శరచ్చంద్ర జ్యోతిశ్రీ

సమ సమాజ భావన నేటి కర్తవ్యం

డా॥ కత్తి పద్మారావు

ఈనాడు కులం నిచ్చెనమెట్ల మీద ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో ఉంది. ఉత్పత్తి శక్తులకు పనివ్వకుండా వారిని వలసపక్షులుగా మార్చివేశారు. రెండు రాష్ట్రాల దళిత, బహుజన కార్మికులు ముంబైలోనూ, పూనే లోనూ, బెంగుళూరు లోనూ, మద్రాసులోనూ, కలకత్తాలోనూ, రాళ్లెత్తే కూలీలుగా మారిపోయారు. అనేక దేశాలలో దళిత బహుజన స్త్రీలు ఇళ్లలో పాచీ పనివారుగా జీవిస్తున్నారు. వారికి భద్రత లేదు. సరైన నివాసాలు లేవు. అనేక వ్యాధులకు గురై అక్కడికక్కడే మరణించినా శవ ఖనన కార్యక్రమాలు కూడా చేసే దిక్కులేని పరిస్థితుల్లో ఉన్నారు. దీనికి కారణం ఎవరు? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం అని చెప్పక తప్పదు. నేడు ఊళ్లు సజీవంగా లేవు. ఉత్పత్తి లేని ఊళ్లు చీకటి కొట్టుల్లా ఉన్నాయి. గిరిజనుల్లో అయితే గర్భవతులను ఆసుపత్రులకు మోసుకెళ్లే మధ్యలోనే చనిపోతున్నారు. వ్యవసాయ కూలీలు మొత్తం మీద ఇరవై రోజుల కంటే ఊరులో ఉండటం లేదు. దాంతో వాళ్ళు కుండా, చట్టి పట్టుకుని, చిన్న పిల్లల్ని చంకలో వేసుకుని సుదూర ప్రాంతాలకు వెళ్ళి రైల్వే స్టేషన్లు, ప్లాట్ ఫామ్‌లలోనూ, ఫుట్ పాత్‌ల పైనా, చావిళ్ళలలో బాధ్యతలేని దుర్భరమైన జీవితం జీవిస్తున్నారు. ఏ పల్లెలోనూ కుటీర పరిశ్రమలు లేవు. వ్యవసాయ ఉత్పత్తులకు తగిన కుటీర పరిశ్రమలను గ్రామ గ్రామంలో రూపొందించు కోవాల్సిన బాధ్యతను మరిచారు. దళిత బహుజనులను దెబ్బతీయడం కోసం వ్యవసాయ పారిశ్రామికతను పెంచుతూ హరిత విప్లవం పేరుతో వ్యవసాయానికి యంత్ర పరికరాలు రూపొందించి ఒకే ఎకరంలో ఎక్కువ ధాన్యం పండించే విధానం తీసుకొచ్చారు. దీనితో భూమి రేట్లు విపరీతంగా పెరిగాయి. లక్షల, కోట్ల రూపాయల్లోకి భూమి ధరలు వెళ్లాయి. భూమి అమ్మే విషయంలో దళితులు ముందున్నారు. కొనే విషయంలో లేరు. ఈ యంత్ర పరికరాల వల్ల నాటు, కోత, కుప్పనూర్పిడికి వ్యవసాయ కూలీల అవసరం తగ్గుతూ వచ్చింది. మరి కుటీర పరిశ్రమలు లేక, వ్యవసాయ కూలీ లేక దళితుల జీవనం ఎలా? అని ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. దళితుల జీవితాలపైన కావాలనే దెబ్బతీస్తున్నారనేది మనకు ఇక్కడ స్పష్టమవుతుంది.

ముఖ్యంగా దళితులకు కల్పించిన హక్కులమీద పెద్ద ఎత్తున దాడి జరుగుతోంది. బ్రాహ్మణ వాదం ముసుగులో పాలకులు రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయంగా కార్పొరేట్ వ్యవస్థ కోరలు సూరుతున్నారు. పాలకుల నోట రైతు అనే శబ్దం బహుగా ఉచ్చరిస్తున్నారు. దళిత అనేశబ్దాన్ని విస్మరిస్తున్నారు.

బి.జె.పి పాలనలో రెండు రాష్ట్రాల అగ్రకుల పాలనలోనూ దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయి. 2011లో దళితులపై దాడులు 33,719 జరిగాయి. జాతీయ నేరాల నమోదు బ్యూరో గణాంకాల ప్రకారం దళితులపై హింసాత్మక దాడులు విపరీతంగా పెరిగాయి. దళితుల ఆత్మగౌరవంపై దెబ్బ కొట్టే దాడులుగా ఇవి జరగడమే కాక కాలేజీల్లో, విశ్వవిద్యాలయాల్లోనూ, స్కూళ్ళలోనూ, గ్రామాల్లోనూ అనేక ప్రాంతాల్లో ఈ దాడులు జరుగుతున్నాయి. 2011లో 33,719 దాడులు జరిగితే 2022 నాటికి 50,291కి పెరిగాయి. అంటే దాడులు చేసిన వారి మీద ఎస్సీ,ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ ఎట్రాసిటీ యాక్ట్ పెట్టడం లేదు. దళితులు పోలీస్ స్టేషన్ కెళితే వారిని అవమానిస్తున్నారు. వారిపై అత్యాచారాలు చేస్తున్నారు. తెలంగాణాలో మరియమ్మ అనే దళిత తల్లిని చంపిన విషయం కూడా మన కళ్ళకి కట్టినట్లు కనబడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమైతే ఒక అడుగు ముందుకేసి దళితులకు రాజ్యాంగం కల్పించిన ప్రధానమైన అంబేద్కర్ విదేశీ చదువు పథకాన్ని రద్దు చేసి జగన్ పేరుతో ఆ పథకాన్ని మార్చారు. ప్రపంచవ్యాప్తంగా తెలిసిన అంబేద్కర్ పేరును రద్దుచేసి పక్క రాష్ట్రాల్లో కూడా తెలియని జగన్‌మోహన్ రెడ్డి పేరుతో ఆ పథకాన్ని మార్చడమే కాక ఆ స్కీమ్‌లో లబ్ధిదారులుగా ప్రతిభ పేరుతో దళితుల సంఖ్యను తగ్గించి ఆ స్కీమ్‌ను అన్ని కులాలకు అని పేరు పెట్టి దళితులకు మొండిచెయ్యి చూపించే విధానాలను అనుసరిస్తున్నాడు. ముఖ్యంగా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం సబ్ ప్లాన్ నిధుల్ని రద్దుచేసే సాహసం చేయడం రాజ్యాంగ హక్కులను ఉల్లంఘించడానికి బహిరంగంగా సిద్ధపడటమే. సబ్ ప్లాన్ నిధుల వల్ల దళితులకు ఒక ప్రత్యేకమైనటువంటి బడ్జెట్ ఏర్పడుతుంది. వారిలోని పేదరికం, నిరక్షరాస్యత, అనారోగ్యం, నిరుద్యోగం, అణచివేత, వంటి వాటన్నింటినీ నివారించడానికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించుకునే అవకాశం కలుగుతుంది. దాని మీద గొడ్డలి వేటు వేశారు. తెలంగాణా ప్రభుత్వం కూడా సబ్ ప్లాన్ నిధుల్ని వ్యవసాయ భూముల్ని కొని దళితులకు ఇచ్చే పథకాన్ని ఉపయోగించడం లేదు. నిర్మాణాత్మకమైన దళితుల అభివృద్ధి మీద బి.జె.పి., టి.ఆర్.ఎస్., వై.ఎస్సార్.సి.పి.లు సమ్మెట దెబ్బ వేశాయి. దీనితో చదువుకున్న విద్యార్థులు దిక్కు తోచక, పని, ప్రోత్సాహం లేక బ్యాంకులు రుణాలు ఇవ్వక ఇంటా, బయటా అపహాస్యానికి గురై, ఆత్మహత్యా సదృశ్యంగా బతుకుతున్నారు. ఇకపోతే ఒక పక్క కులం లేదని చెబుతూ కులాన్ని, మతాన్ని యధేచ్ఛగా ప్రోత్సహిస్తూ అగ్రకులాల, సంస్థలకు, ట్రస్ట్‌లకు బ్యాంకులు విపరీతంగా ధనాన్ని ఇస్తూ మత కేంద్రాలను ప్రోత్సహిస్తూ అంబేద్కర్ యువజన సంఘాలకు మొండిచెయ్యి చూపిస్తూ కులతత్వాన్ని యధేచ్ఛగా ప్రభుత్వాలూ ప్రోత్సహిస్తున్నాయి.

మహిళలను ఉద్ధరిస్తున్నామని రోజూ ప్రకటించుకున్న ఈ ప్రభుత్వాలు స్త్రీ విద్య అత్యున్నతంగా జరుగుతున్న ఈ దశలో ఉద్యోగాలను ఊరిస్తూ జాబ్‌లకు నిర్దిష్ట ప్రణాళిక, ప్రకటనలు చేయకుండా వారిని నిరాశావాదులుగా మార్చి కుటుంబాలలో తీవ్రమైన సంక్షోభాన్ని సృష్టిస్తున్నారు. వయసు, జాతి, వర్గ, వర్ణ, లింగ, బేధం లేకుండా మత్తుమందులు, మద్యం సరఫరా చేస్తూ యువశక్తిని, నిర్వీర్యంచేసి అరాచక శక్తులుగా మార్చి వేస్తున్నారు. నిజానికి పాలకులు దళిత ద్రోహులుగా, దళిత జీవన వ్యవస్థ విధ్వంసకులుగా, దళిత చట్టాలు కాలరాసే వారుగా తమ పాలన కొనసాగిస్తున్నారు. అందుకే ఇప్పటికీ అస్పృశ్యతా భారతంగానే దేశం ఉంది. అందుకే రాజస్థాన్‌లో కుండలో మంచి నీళ్ళు తాగినందుకు ఉపాధ్యాయుడు విద్యార్థిని కొట్టి చంపిన ఉదంతం మన కళ్ళముందు కన్పిస్తుంది. స్వాతంత్ర్య వజ్రోత్సవాల సాక్షిగా, అంబేద్కర్, ఫూలే, మార్క్స్ వాదులు ఇక ఉపేక్షించడానికి వీల్లేదు. దళిత బహుజన రాజ్యాధికారం కోసం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైంది. దళితుల జీవించే హక్కుపై ఉక్కు పాదం మోపుతున్న అగ్ర కుల పాలక వర్గాన్ని దించి అందరికీ సంపదపంచే కుల అస్పృశ్యతా నిర్మూలనకు రాజ్యాంగ బద్ధమైన ఆచరణను కలిగి ఉండే ప్రభుత్వాలను దళిత బహుజన మైనారిటీ ప్రభుత్వాలను రూపొందించుకోవడమే నేటి చారిత్రక కర్తవ్యం.

వ్యాసకర్త దళిత సామాజిక ఉద్యమ కర్త, ఫోన్ : 9849741695

యోగాభ్యాసం బౌద్ధుల సంప్రదాయం

డాక్టర్ దేవరాజు మహారాజు

బుద్ధుడు వేద కాలానికి ముందు జీవించినవాడు. ఆయన ధ్యానముద్ర ప్రపంచానికి ఎప్పటినుండో తెలుసు. ఆయనని 'యోగుల చక్రవర్తి' అని కూడా పిలుచుకున్నారు. వేదాలు రాసిన కాలానికిముందే యోగ, ధ్యానం వంటివి ఉన్నాయి. శ్రమణులు, సాధువులు, రుషులు ఈ పద్ధతుల్ని ఆచరిస్తూ ఉండేవారు. ధ్యానముద్రలో వజ్రాసనంలోఉన్న బుద్ధుని విగ్రహం ప్రపంచంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన విషయం మనకు తెలుసు. పాళీ భాషలో యోగ/ధ్యాన సాధనపై 'విశుద్ధిమగ్గ' అనేబృహద్గ్రథం ఉంది. యోగాభ్యాసం బుద్ధ సంప్రదాయానికిగర్వకారణం. నిజానికి 'యోగ ధ్యానం' అంటే మనిషి తనతో తనకుగల సంబంధాన్ని అన్వేషించుకోవడం. బైటతిరిగే బదులు, ఎవరి లోపల వారు తిరగడం. మనసుని అదుపులో పెట్టుకుని ఏకాగ్రతతో సాధన చేయడం. క్రోధం, ద్వేషం, దురాశ వంటి దుర్గుణాలను వదులు కుని, మనసుని శుద్ధి చేసుకోవడం. దాని వల్ల జీవితంలో దు:ఖాలు దూరమవుతాయి. సుఖశాంతుల వెలుగులు ప్రసరిస్తాయి. ఇది సాధించిన వారే శ్రమణులు, యోగులు, సాధకులు అవుతారు. యోగ ధ్యానానికి తథాగతుడు చాలా ప్రాముఖ్యమిచ్చాడు. ఆయన ధమ్మపదలో ఇలా చెప్పాడు

యోగవే జయంతి భూరి అయోగభూరి సధ్ఖో
ఏతం ద్వేధ పథం జ్ఞాతా భవయ్ విభావయ్చ
(తత్ అత్తనం నివేశేయ-భూవి పద్ధతి)

అర్థం ఏమిటంటే, యోగాభ్యాసం వల్ల జ్ఞానం పెరుగుతుంది. ఆచరించకపోతే ఉన్న వివేకం నశిస్తుంది. మనిషి పురోగతి, పతనం రెండూ అతని ఆధీనంలోనే ఉన్నాయి. నిరంతర జ్ఞాన సముపార్జనకు యోగధ్యాన సమాధిలో తమనుతాము నిమగ్నం చేసుకోవాలి.

ప్రజ్ఞ- అంటే అంతర్దృష్టి. విచక్షణ- దీనివల్ల కోరిక నశిస్తుంది. వస్తువుల మీద, బంధాల మీద అనురక్తి నశిస్తుంది. అప్పుడుగాని, బుద్ధుని మార్గం అర్థంకాదు. వినయం, సమాధి, జ్ఞానం ఈ మూడింటి సమాహారమే-బుద్ధుని మార్గం! బుద్ధుని తర్వాత బోధి ధర్మ కుమార జీవ, వంటి బౌద్ధ బిక్షువులు ఈ 'భారతీయ సంస్కృతి"ని మొత్తం ఆసియా దేశాలకు వ్యాప్తి చేశారు. రవాణా సౌకర్యాలు లేని ఆ రోజుల్లో ప్రాణాలకు తెగించి, నెలలూ, సంవత్సరాలూ ప్రయాణించి, ప్రపంచ పౌరులెందరో నలందా, తక్షశిల విశ్వవిద్యాలయాలకు వచ్చేవారు. విభిన్న విశ్వాసాలు ఉన్న ప్రజలు భారతదేశంలో బుద్ధుడికి ముందూ ఉన్నారు. బుద్ధుడి తర్వాతికాలంలో కూడా ఉన్నారు. అయితే, యోగాభ్యాసాన్ని, ధ్యానాన్ని మాత్రం బుద్ధుణ్ణి అనుసరించే నేర్చుకున్నారు. కొందరు మాత్రం తాము నేర్చుకున్న వాటికి వారి స్వంత పైత్యాన్ని కొంత జోడిస్తూ వచ్చారు. మంత్రం, ప్రార్థన, శక్తిశాఖ వంటి వాటితో యోగాను నింపేశారు. ఫలితంగా ఉపనిషత్తులు, యమ, నియమ, ఆసన, ప్రాణాయామం, ప్రత్యాహార, ధారణ వంటివి అందులో చేరాయి.

బుద్ధుణ్ణి దశావతారాల్లో చేర్చుకున్నట్టుగానే, బుద్ధుడి యోగాభ్యాసం ధ్యానాలను వైదిక మతస్థులు మొదట స్వీకరించారు. తర్వాతకాలంలో పూర్తిగా మార్చేశారు. ఇప్పుడు మనం నిత్యజీవితంలో వాడుతున్న 'యోగక్షేమాలు' అనే పదం బుద్ధుడు చెప్పిన యోగాభ్యాసం నుండే వచ్చి ఉంటుంది. అయితే ఇప్పుడు మనం చూస్తున్న, వింటున్న యోగ సూత్రాలన్నీ బౌద్ధానంతర రచనలు. బౌద్ధాన్ని నాశనం చేసే క్రమంలో ఎన్నో మార్పులు, చేర్పులు చేసుకున్నట్టుగానే, యోగాభ్యాసాన్ని కూడా మార్చేశారు. వాడుకలో ఉన్న ఇప్పటి యోగకు, ఒకప్పుడు బుద్ధుడు చెప్పిన యోగాభ్యాసానికి పోలికలు లేవు. బుద్ధ విగ్రహాల రూపురేఖలు మార్చి, వైదికులు తమ దేవీ దేవతల్ని తయారు చేసుకున్నట్లు యోగ సహజ స్వభావాన్ని, ఉద్దేశాన్ని వారు ధ్వంసం చేశారు. వ్యాపార ధోరణిలో నడుస్తున్న నేటి యోగ-మనసు శుద్ధికి ఏ మాత్రం ఉపయోగపడదు. శరీరాన్ని మెలితిప్పడం, ఉతికినట్లు శ్వాసపీల్చి వదలడం-ఇప్పుడు యోగగా చలామణి అవుతూ ఉంది. బుద్ధుడి ఊసు ఎత్తకుండా 'అంతర్జాతీయ యోగా డే' ప్రకటించిన నాడు అసలు యోగా మూలాలు తెలుసు కున్నాడా? గుజరాత్ మారణహెూమానికి కారణమై వేలవేల మంది ప్రాణాలు బలితీసుకున్నవాడు- సంవత్సరానికి ఒక రోజు కళ్లూ, ముక్కు మూసుకుని అరగంట కూర్చుంటే యోగ ఫలితం దక్కుతుందా? స్వంత ఆలోచనలతో స్వంతనిర్ణయాలు తీసుకొలేనివారు కాపీ-పేస్ట్ చేస్తూ బతకా ల్సిందే! వారికి మరో మార్గం ఉండదు. ఎప్పుడైనా, ఎక్కడైనా స్వంత మెదడుతో పనిచేసేవారికి మాత్రమే మార్గాలు దొరుకుతాయి. కాపీ కొట్టేవారు ఎక్కడో ఓచోట, ఎన్నడో ఓనాటికి దొరికిపొవాల్సిందే! భారత దేశంలో ఉన్న హిందూ దేవాలయాలన్నీ జైన/బౌద్ధారామాలని మార్చినవే తెలిసిపోలేదా? అలాగే యోగ కూడా బౌద్ధుల నుండి కాపీ కొట్టిందే అని స్పష్టమైపోయిది.

సరే, ఇక పతంజలి యోగ గురించి ఏమన్నాడో, అంతను ప్రతిపాదించి యోగ సూత్రాల సారాంశం ఏమిటో కూడా పరిశీలిద్దాం- చిత్తవృత్తి నిరోధం ద్వారా ఆత్మను పరమాత్మలో కలిపేందుకు 194 యోగ సూత్రాలు ప్రతిపాదించాడు-పతంజలి! విభూది పాదంలోని 17వ సూత్రం నుండి 40వ సూత్రం దాకా పరిశీలించినట్లయితే, మనకు ఎన్నో అభూత కల్పనలు కనిపిస్తాయి. యోగ చేసినవారికి 1.సకలజీవుల భాషలు తెలుస్తాయని అన్నారు. 2. శరీరం కనబడకుండా సంచరించవచ్చని అన్నారు. 3. మరణించిన పూర్వీకులతో మాట్లాడవచ్చని అన్నారు. 4.భూత, భవిష్యత్ జ్ఞానం కలుగుతుందని అన్నారు. 5. ఆకలి దప్పులు ఉండవని అన్నాడు. 6. ఏనుగంత బలంం వస్తుందనీ, దివ్య శక్తులు లబిస్తాయనీ చెప్పాడు. 7. ఇతరులు శరీరంలోకి జొరబడొచ్చనీ అంటే పరకాయ ప్రశేశం చేయచ్చనీ అన్నాడు. మరి ఇన్ని శతాబ్దాలలో వీటిలో ఏ ఒక్కటైనా, ఏ ఒక్కరి విషయంలోనైనా నిజమైందా? కొంచెం ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తే అవన్నీ భ్రమలని, కల్పితాలనీ అర్థం అవుతూ ఉంది కదా? దైవం, ఆత్మ, పరమాత్మ అని ప్రభోదించే వైదిక మతంలోనే ఇవన్నీ ఇమిడిపోతున్నాయి. అసలు దైవం అంటూ ఎవరూ లేరు. ప్రతిదీ కార్యాకారణ సంబంధంతో జరుగుతూ ఉంది. నిన్ను నీవు, నీ మనసును నువ్వు ఆధీనంలో ఉంచుకోవడానికి స్థిరచిత్తుడవై ఉండడానికి యోగా భ్యాసం మంచిదన్న బుద్ధుడి బోధనలకు, వైదిక మత ప్రచారాలకూ తేడా స్పష్టంగా కనిపిస్తోంది కదా?

తాము యోగ చేస్తున్నామని, దానివల్ల మనసూ, శరీరం ప్రశాంతంగా ఉంటున్నాయని ఈ రోజుల్లో ఎవరు చెపుతున్నారు? సినీ నటులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, కార్పొరేట్లు చెపుతున్నారు. అవి, సామాన్య జనాన్ని ప్రభావితం చేయడానికి చెప్పే కబుర్లేతప్ప వీరిలో ఎవరైనా మనసుని నిశ్చలంగా ఉంచుకోగలుగుతున్నారా? కోరికలులేని స్థాయికి చేరుకోగలుగుతున్నారా? వారి వారి వ్యాపారాలు పెంచుకోవ డానికో, పబ్లిసిటీ పెంచుకోవడానికో, ప్రజల దగ్గర మంచి మార్కులు కొట్టేయడానికో చేసే గిమ్మిక్కులు తప్ప -బుద్ధుడు చెప్పిన యోగాభ్యాస సారాంశం ఏ కొంచమైనా వీరి మెదడుకు ఎక్కిందా? 'యోగ' అనేమాట వాడుకుని, లాభం పొందడం తప్ప-ఇప్పుడు వీరు చేస్తున్న ప్రచారాలకు అర్థమే లేదు. యోగ గురువుల పక్కన చేరి సినిమా నటీమణులు ఒళ్లు విరుచుకుంటూ ప్రదర్శనలు ఇవ్వడం తప్ప, దానివల్ల సామాన్య జనానికి ఏమిటీ లాభం? ఒక శుంఠ పక్కన మరో శుంఠ చేరి ప్రజల మెదళ్లను ఆకర్షించి, ఆధీనంలో ఉంచుకోవడానికి చేసే అతి తక్కువస్థాయి ప్రయత్నం అది! దేశం బాధ్యత, ప్రజల బాధ్యత తీసుకున్నవాడు తను తప్పనిసరిగా చేయాల్సింది చేయకుండా సంవత్సరానికి ఓరోజు వందమందిని వెనకేసుకుని, ముక్కు మూసుకుని కెమెరాలకు పోజులిస్తే అది 'యోగ డే" అయిపోతుందా? దాని వల్ల జనం బాధలు ఏమైనా తగ్గుతాయా? సముద్రపు ఒడ్డునో లేక ఫుట్‌పాత్‌మీదో ప్లాస్టిక్ బ్యాగ్‌లు ఏరుతూ జనానికి వీడియోలు పంపితే..అది సుపరిపాలన అయిపోతుందా? ఈ యోగ విషయం కూడా అంతే! పదిమంది కెమెరా వాళ్లను తీసుకుని వెళ్లి తల్లి దగ్గర కూర్చునేవాడు, అటు తల్లి విలువను, ఇటు తన విలువనూ తగ్గించుకున్నవాడే అవుతాడు. అవసరమైంది తప్ప-పబ్లిసిటీ కోసం అనవర మైనవి చేస్తే, వాటికి ఉన్న విలువ కూడా ఉండదు. యోగాభ్యాస మంటే ఏమిటో తెలుసుకోకుండా ఓ 'అంతర్జాతీయ యోగా డే' ప్రకటించిన వాడు అంతర్జాతీయ అజ్ఞాన శిరోమణిగా చరిత్రలో నమోదు అవుతాడు.

కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.

డ్రైవర్ దాష్టీకం

బస్సు ఆపకుండా మహిళలపైకి దూసుకెళ్లిన వైనం

తుమకూరు: టికెట్ కలెక్షన్ రాలేదనే కోపంతో మహిళా ప్రయాణికులను ఎక్కించుకోకుండా బస్సును ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్ చర్యను మహిళలు అడ్డుకోగా వారిపైకి బస్సును దూకించేందుకు యత్నించాడు. ఈ ఘటన బెంగళూరులోని తుమకూరు జిల్లా కొరటగెరె నాగేనహళ్లి గేట్ వద్ద జరిగింది. చామరాజనగర జిల్లా కొళ్లేగాల నుంచి కొందరు మహిళలు జిల్లాలోని గోరవనహళ్లి మహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి వచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం స్వగ్రామానికి వెళ్లేందుకు నాగేనహళ్లి గేట్ వద్ద వేచి ఉన్నారు. ఆ మార్గంలో వచ్చిన కేఎస్ ఆర్టీసీ బస్సును ఆపేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే కలెక్షన్ లేదని బాధతో ఉన్న డ్రైవర్ బస్సును ఆపలేదు. దీంతో మహిళలు బస్సు ముందుకు వెళ్లి ఆపే ప్రయత్నం చేయగా డ్రైవర్ వారిపైకి వాహనాన్ని ఎక్కించే ప్రయత్నం చేశాడు. డ్రైవర్ ప్రవర్తనపై మహిళలంతా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్ మునిశామి రెడ్డి మహిళలకు వేరే బస్సును ఏర్పాటు చేశారు. బస్సు డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

మనీ లాండరింగ్ కేసులో బుకీ అనిల్ జైసింఘానీపై ఈడీ చార్జి షీట్

న్యూఢిల్లీ : 2015 ఐపీఎల్ బెట్టింగ్ కేసుకు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో దర్యాప్తు ఎదుర్కొంటున్న క్రికెట్ బుకీ అనిల్ జైసింఘానిపై ఛార్జ్ షీట్ దాఖలు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) శనివారం తెలిపింది. జైసింఘానిని దర్యాప్తు సంస్థ ఏప్రిల్‌లో అరెస్టు చేసింది. 2015లో ప్రత్యేక మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఎ) కోర్టు అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసిన తర్వాత అతను సమన్లను తప్పిస్తున్నాడని, విచారణకు సహకరించడం లేదని ఈడీ తెలిపింది. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ భార్య అమృతా ఫడ్నవీస్‌కు లంచం ఇచ్చి బ్లాక్‌మెయిల్ చేసేందుకు కుట్ర పన్నారని, అనేక కేసుల నుంచి జైసింఘానిని రక్షించేందుకు ఆమె నిరాకరించినప్పుడు ఆమె నుంచి డబ్బు వసూలు చేసేందుకు ప్రైవేట్ మెసేజ్‌లను ఉపయోగించారని ఆరోపిస్తూ జైసింఘాని, అతని కుమార్తె అనిక్షను కూడా ముంబై పోలీసులు కొన్ని నెలల క్రితం అరెస్టు చేశారు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌లపై బెట్టింగ్‌లు కాసే వివిధ బుకీలపై నమోదయిన వడోదర పోలీసుల 2015 ఎఫ్ఐఆర్ ఆధారంగా జైసింఘానిపై ఈడీ కేసు ఉంది. 'అనిల్ జైసింఘాని క్రికెట్ బెట్టింగ్ కార్యకలాపాలలో పాల్గొంటూ, మోసపూరిత కార్యకలాపాల ద్వారా బెట్టింగ్ కార్యకలాపాలలో నిమగ్నమైన మారుతి-అహ్మదాబాద్‌తో సంబంధం ఉన్న వ్యక్తుల ద్వారా భారీ మొత్తంలో డబ్బును కూడబెట్టాడు' అని ఈడీ తెలిపింది. దర్యాప్తు సంస్థ మే నెలలో అతని ప్రాంగణంలో దాడులు నిర్వహించి జూన్ 5న జైసింఘానికి చెందిన రూ.3.40 కోట్ల విలువైన హోటల్ ఆస్తిని (మహారాష్ట్రలోని షిర్డీలో ఉంది) తాత్కాలికంగా జప్తు చేసింది. మనీ లాండరింగ్ ఆరోపణల కింద జైసింఘానిపై ఈడీ జూన్ 6న ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. అహ్మదాబాద్‌లోని ప్రత్యేక పీఎంఎల్‌ఏ కోర్టు ప్రాసిక్యూషన్ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకుందని పేర్కొంది.

మహారాష్ట్ర సీఎం నివాసం ఎదుట ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

థానే : థానేలోని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఇంటి ముందు శనివారం ఉదయం 42 ఏళ్ల ఆటోరిక్షా డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అయితే అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది అతని ప్రయత్నాన్ని విఫలం చేశారని ఒక అధికారి తెలిపారు. వినయ్ పాండే తనపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకునే ప్రయత్నంలో ఒత్తిళ్లకు గురై కిందపడిపోయాడని వివరించారు. వాగ్లే ఎస్టేట్ పోలీస్ స్టేషన్ అధికారి మాట్లాడుతూ ఆటోరిక్షా డ్రైవర్ తనపై కేసు నమోదు చేయడం వల్ల ఇప్పటివరకు లైసెన్స్ ఇవ్వలేదని వాపోయారు. విచారణలో భాగంగా పోలీసులు అతనితో మాట్లాడుతున్నారని అధికారి తెలిపారు. ఘటన జరిగిన సమయంలో డ్రైవర్ అరుస్తూ ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఘటన జరిగినప్పుడు ముఖ్యమంత్రి ఇంట్లో లేరని పోలీసులు తెలిపారు.

291కి చేరిన బాలాసోర్ రైలు ప్రమాద మృతులు

కటక్ : బాలాసోర్ రైలు ప్రమాదంలో బీహార్‌కు చెందిన ఒక ప్రయాణికుడు శనివారం ఇక్కడ ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడంతో మృతుల సంఖ్య 291కి చేరుకుందని అధికారులు తెలిపారు. ప్రయాణికుడిని బీహార్‌లోని భాగల్‌పూర్ జిల్లా రోషన్‌పూర్‌కు చెందిన సాహిల్ మన్సూర్ (32) గా గుర్తించారు. అతను ట్రామా కేర్ ఐసీయూలో చికిత్స పొందుతున్నాడని, రోగి కిడ్నీ సంబంధిత వ్యాధితో కూడా బాధపడుతున్నాడని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. అతను డయాలసిస్‌లో ఉన్నాడని వివరించారు. కార్డియాక్ అరెస్ట్ కారణంగా రోగి మరణించాడని ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాన్షు శేఖర్ మిశ్రా తెలిపారు. అతనికి అంతర్గత, బాహ్య గాయాలు ఉన్నాయని, మూత్రపిండ సమస్యలు కూడా ఉన్నాయని చెప్పారు. ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేరిన 205 మంది రోగులలో 46 మంది రోగులు ఇంకా చికిత్సలో ఉన్నారని, ఇందులో 13 మంది రోగులు ఐసీయూలో ఉన్నారని మిశ్రా తెలిపారు. ఐసీయూలో ఉన్న 13 మంది రోగులలో ఇద్దరు నుంచి ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని, మిగిలిన రోగుల పరిస్థితి నిలకడగా ఉందని ఆయన అన్నారు. శుక్రవారం బీహార్‌లోని గోపాల్‌గంజ్ జిల్లాలోని పాత్ర గ్రామానికి చెందిన ప్రకాష్ రామ్ (22) అనే వలస కూలీ ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో మరణించాడు. మంగళవారం తెల్లవారుజామున బీహార్‌కు చెందిన బిజయ్ పాశ్వాన్ అనే ప్రయాణికుడు కటక్‌లోని ఎస్‌సీబీ వైద్య కళాశాల ఆస్పత్రిలో గాయాలతో మరణించాడు. జూన్ 2న జరిగిన మూడు రైళ్లు ఢీకొన్న ప్రమాదంలో 287 మంది అక్కడికక్కడే మరణించగా, 1,208 మంది గాయపడ్డారు. మూడు రైళ్లు-షాలిమార్-చెన్నై సెంట్రల్ కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, గూడ్స్ రైలు ఢీకొన్నాయి. ఇది భారతదేశపు అత్యంత ఘోరమైన రైలు ప్రమాదాలలో ఒకటి. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ నిలిచిన ఉన్న గూడ్స్ రైలును ఢీకొట్టింది. దీంతో దానిలోని అనేక బోగీలు పక్కనే ఉన్న పట్టాలపై బోల్తా పడ్డాయి. అదే సమయంలో ఆ పట్టాలపై బెంగళూరు-హౌరా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కూడా అదే సమయంలో ప్రయాణిస్తుండటంతో ప్రమాదం జరిగింది. ఇదిలా ఉండగా, భువనేశ్వర్ ఎయిమ్స్‌లో 81 మృతదేహాలు గుర్తించబడలేదు. 70 మందికి పైగా ఇప్పటికే వారి డీఎన్ఏ పరీక్షల కోసం రక్త నమూనాలను అందించినప్పటికీ, నివేదికలు ధ్రువీకరణ కోసం వేచి ఉన్నాయని ఒక అధికారి తెలిపారు. గత 15 రోజులుగా మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రి వెలుపల ఆసక్తిగా ఎదురుచూస్తున్నందున కనీసం 15 మందికి డీఎన్ఏ నమూనా పరీక్ష నివేదికను పంపాలని ఏఐఐఎంఎస్ భువనేశ్వర్ అధికారులు శనివారం ఢిల్లీలోని సెంట్రల్ ఫోరెన్సిక్ లాబొరేటరీకి లేఖ రాశారు.

లోక్‌సభ ఎన్నికల్లో పోటీపై నిర్ణయం తీసుకోలేదు

కర్నాటక కాంగ్రెస్ ఎంపీ సురేశ్

రామనగర (కర్నాటక) : 2014 పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేయడంపై తాను ఇంకా నిర్ణయం తీసుకోలేదని, సరైన అభ్యర్థి దొరికితే మార్గనిర్దేశం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కర్నాటక నుంచి కాంగ్రెస్‌కు చెందిన ఏకైక లోక్‌సభ సభ్యుడు డి.కె.సురేశ్ శనివారం అన్నారు. బెంగళూరు దక్షిణ సెగ్మెంట్‌కు చెందిన ఎంపీ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ తమ్ముడు సురేశ్ ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ 'ఇప్పుడు రాజకీయాలు అంత బాగుండ లేదు. నేను ఎన్నికల్లో (లోక్‌సభ) పోటీ చేయడంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. నేను మా కార్యకర్తలు, నాయకులను అడగాలి. తగిన అభ్యర్థి ఉంటే, నేను మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను' అని తెలిపారు. గతంలో కూడా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. అధికార దాహం ఉన్నవారు రాజకీయాలు చేయాలనుకుంటున్నారని పేర్కొన్న ఎంపీ ఈరోజు ఒక ప్రశ్నకు సమాధానంగా... 'నాకు ఉన్నది అభివృద్ధి చేయాలనే దాహం. అభివృద్ధి చేయడానికి మరో ఏడాది ఉంది. ఆ తర్వాత చేస్తాను. చూద్దాం. ఇప్పటికి నేను (ఎన్నికల్లో పోటీ చేయాలని) నిర్ణయించుకోలేదు' అని స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి బీజేపీ, జేడీ(ఎస్) మధ్య అవగాహన కుదిరిందనే వార్తలపై ఒక ప్రశ్నకు, 'వాళ్లకు అవగాహన ఉండనివ్వండి. ఎవరైనా పోటీ చేయనివ్వండి. మనందరికీ ఒకే ఓటు ఉంటుంది. ప్రజలు నిర్ణయిస్తారు' అని అన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలోని 28 స్థానాల్లో కేవలం ఒక్క సీటును మాత్రమే గెలుచుకున్న కాంగ్రెస్ ఇప్పుడు 2024 ఎన్నికల్లో 20 సీట్లు గెలుచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం సాధించింది.

బీజేపీపై తొలుగుతున్న భ్రమలు

కేరళలో కాషాయపార్టీని వీడుతున్న సినీ ప్రముఖులు

తిరువనంతపురం : కేరళలో సినీ ప్రముఖులకు బీజేపీపై భ్రమలు తొలుగుతున్నాయి. సినీ గ్లామర్‌ను ఉపయోగించుకొని కేరళ రాజకీయాల్లో లబ్ధి పొందేందుకు కాషాయ పార్టీ పడుతున్న పాట్లను గమనించిన వారు ఒక్కొక్కరుగా కమలం పార్టీని వీడుతున్నారు. గత పది రోజుల్లో ముగ్గురు సినీ ప్రముఖులు పార్టీని వీడారు. చిత్ర దర్శకుడు అలీ అక్బర్ అలియాస్ రామసింహన్ అబూబక్కర్(60) శుక్రవారం బీజేపీకి రాజీనామా చేశారు. గతేడాదే ఇస్లాంను వీడి హిందూ మతంలోకి మారిన అలీ అక్బర్ తన పేరును రామసింహన్ అబూబక్కర్‌గా మార్చుకున్నారు. ఆయన తన నిర్ణయాన్ని ఫేస్‌బుక్ పోస్టులో ప్రకటించడమే కాకుండా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె సురేంద్రన్‌కు తెలుపుతూ ఏక వాక్య రాజీనామా పత్రాన్ని సైతం పోస్టు చేశారు. " నేను ఎలాంటి రాజకీయాలకూ బానిసను కాను. ఇప్పుడు నేను అన్నింటి నుంచి విముక్తుడనయ్యాను. ధర్మం కోసమే నిలబడతాను" అని రామసింహన్ ఆ పోస్టులో పేర్కొన్నారు. బీజేపీ తరఫున ఉన్న ముస్లిం వ్యక్తులలో అత్యంత ప్రముఖుడైన అక్బర్ 2021 అక్టోబరులో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా వైదొలిగారు. అప్పటి నుంచి ఆయన పార్టీలో ఒక సాధారణ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

ఉత్తర కేరళలోని ముస్లింలలో ఆరెస్సెస్ గురించి ప్రచారం చేసేందుకు అక్బర్‌ను ఉపయోగించుకోవాలని బీజేపీ భావించింది. అయితే ఆయన పార్టీని వీడటంతో బీజేపీకి గట్టి దెబ్బ తగిలినట్టయిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా కొనసాగిన ప్రముఖ మళయాల చిత్ర దర్శకులు రాజసేనన్ గతవారమే ఆ పార్టీని వీడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసిన నటుడు భీమన్ రఘు తాను కూడా బీజేపీని వీడనున్నట్టు సంకేతాలు పంపారు. సీఎం పినరయి విజయన్‌కు గొప్ప అభిమానిననీ, ఆయనతో సమావేశం తర్వాత తన తదుపరి నిర్ణయాన్ని ప్రకటిస్తానని రఘు గతవారమే ప్రకటించాడు.

ఓటుకు నోటు వద్దని అమ్మానాన్నకు చెప్పండి

విద్యార్థులతో నటుడు విజయ్

చెన్నై : డబ్బులు తీసుకోకుండా ఎన్నికల్లో ఓటు వేయాలని మీ తల్లిదండ్రులకు చెప్పాలని తమిళ సినీ రంగానికి చెందిన ప్రముఖ నటుడు విజయ్ చెన్నైలో జరిగిన కార్యక్రమంలో విద్యారులకు విజ్ఞప్తి చేశారు. తాను ఎన్నికల్లో అరంగేట్రం చేయవచ్చనే ఊహాగానాల మధ్య, డబ్బులు తీసుకోకుండా ఎన్నికల్లో ఓటు వేయమని, తమలో మార్పును చూడాలని శనివారం విద్యార్థులను ఆయన కోరారు. ఆయన ఉద్వేగభరితమైన విజ్ఞప్తి తమిళనాడు యువజన సంక్షేమం, క్రీడల అభివృద్ధి మంత్రి ఉదయనిధి స్టాలిన్ నుంచి ప్రశంసలను పొందింది. 'అతను ఒక మంచి విషయం చెప్పాడు. మీ సమస్య ఏమిటి?' అని విలేకరులు విజయ్ విజ్ఞప్తికి తన ప్రతిస్పందనను కోరినప్పుడు ఉదయనిధి తిరిగి ప్రశ్నించారు. నటుడు విజయ్ రాజకీయ రంగ ప్రవేశంపై అడిగిన ప్రశ్నకు, ఉదయ నిధి స్పందిస్తూ, రాజకీయ రంగ ప్రవేశం ఎవరికైనా హక్కు ఉందని మంత్రి అన్నారు. విడుతలై చిరుతైగల్ కట్చి (వీకేసీ) అధినేత, అధికార డీఎంకే మిత్రపక్షం తోల్ తిరుమావళవన్ కూడా నటుడు విజయ్ విద్యార్థులకు చేసిన అభ్యర్థనను స్వాగతించారు. ఇక్కడ నీలాంగరైలో జరిగిన ఒక కార్యక్రమంలో రాష్ట్రానికి చెందిన 10, 12 తరగతుల టాపర్‌లను సత్కరిస్తూ విజయ్ మాట్లాడుతూ 'ఎన్నికల సమయంలో లంచం తీసుకోకుండా మీ తల్లిదండ్రులను ఓటు వేయమని అడగండి. ప్రయత్నించండి. మీరు విజయం సాధించవచ్చు. మార్పును చూడవచ్చు' అని తెలిపారు. త్వరలో మొదటి సారి ఓటర్లుగా మారే విద్యార్థులు ఓట్లకు నగదు తీసుకోకుండా నాయకుడిని ఎన్నుకోవడంలోని యోగ్యతను గుర్తించాలన్నారు. 'ఇది జరిగితే మీ అందరికీ ఉన్నత విద్య లభిస్తుంది' అని ఆయన అన్నారు. ఓట్ల కోసం డబ్బును స్వీకరించడం ద్వారా 'తమ చేతులతో వారి కళ్లు పొడుచుకోవద్దని' విజయ్ వారిని హెచ్చరించాడు. '1.5 లక్షల మంది ఓటర్లు ఉన్న నియోజకవర్గంలో ఓటరుకు రూ.1,000 ఇచ్చే రాజకీయనాయకుడిని పరిగణించండి. అతను ఎంత లంచంగా ఇచ్చాడు-దాదాపు 15 కోట్లు? ఒక వ్యక్తి రూ.15 కోట్లు లంచం ఇస్తే అంతకు ముందు ఎంత సంపాదించాడో ఆలోచించండి. ఇదంతా మీ విద్యా విధానంలో భాగం కావాలని కోరుకుంటున్నాను' అని ప్రముఖ నటుడు చెప్పగా విద్యార్థులు కరతాళ ధ్వనులు చేశారు. అలాగే, పుస్తకాల జ్ఞానాన్ని సముపార్జించడంతో ఆగిపోకుండా, దానిని దాటి బీఆర్ అంబేద్కర్, ఈవీఆర్ పెరియార్, కే కామరాజ్ వంటి నాయకులందరి గురించి తెలుసుకుని వారి మంచి అంశాలను నింపాలని ఆయన యువకులకు ఉద్బోధించారు. 'నాది ఒక చిన్న విన్నపం. పరీక్షల్లో విజయం సాధించలేని వారితో సమయం గడపండి. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం సులభమని వారికి చెప్పండి. వారిని ప్రోత్సహించండి' అని ఆయన అన్నారు. 'అలాగే ఎప్పుడూ తప్పుడు నిర్ణయాలు తీసుకోకండి. ధైర్యంగా నిర్ణయాలు తీసుకోండి. మీరు జీవితంలో పైకి ఎదుగుతున్నప్పుడు, మీకు లభించే స్వేచ్ఛను స్వీయ క్రమశిక్షణతో నిర్వహించండి. జీవితంలో ఆనందించండి. కానీ మీ గుర్తింపును వదులుకోవద్దు. మన జీవితం మన చేతుల్లోనే ఉంది' అని విజయ్ సలహా ఇచ్చారు. 'నేను మీలాంటి తెలివైన విద్యార్థిని కాదు. సగటు ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని. నా ప్రయాణం సినిమాల దిశగా సాగింది. గుర్తుంచుకోండి, మీరు మీ పాత్ర, ఆలోచనా సామర్థ్యానికి ప్రాధాన్యత ఇస్తేనే చదువు పూర్తవుతుంది' అని అన్నారు. ఆయన అభిమానుల సంఘం తలపతి విజయ్ మక్కల్ ఇయక్కం సంక్షేమ సంస్థగా రూపాంతరం చెందింది. రాష్ట్రంలో 2021 పౌర ఎన్నికల్లో పోటీ చేసి 169 సీట్లలకుగాను 115 స్థానాలను గెలుచుకుంది.

బ్యాగులో శిశువు మృతదేహంతో ఇంటికి

- జబల్‌పూర్ నుంచి బస్సులో 140 కి.మీ ప్రయాణం
- మార్చురీ వ్యాన్ ఇవ్వడానికి నిరాకరించారని ఆరోపణ

దిండోరి/జబల్‌పూర్ : మధ్య ప్రదేశ్‌లో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. తనకు పుట్టిన బిడ్డ మృతదేహాన్ని ఒక బ్యాగులో పెట్టుకుని బస్సులో ప్రయాణించినట్లు ఒక వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశాడు. జబల్‌పూర్‌లోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ నవజాత శిశువు మరణించిన తర్వాత, మార్చురీ వాహనాన్ని అందించడానికి నిరాకరించారని బాధితుడు ఆరోపించాడు. ఈ ఘటన జూన్ 15న జరిగిందని అన్నారు. అయితే చిన్నారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారని, తల్లిదండ్రులు ఆస్పత్రి నుంచి బయటకు తీసుకువెళుతుండగా మగబిడ్డ బతికే ఉన్నాడని రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారి ఒకరు తెలిపారు. రాష్ట్రంలోని దిండోరి జిల్లాలోని సహజ్‌పురి గ్రామానికి చెందిన సునీల్ ధుర్వే మాట్లాడుతూ తన భార్య జమ్నీ బాయి జూన్ 13న ప్రభుత్వ ఆసుపత్రిలో మగబిడ్డను ప్రసవించిందని, శిశువు బలహీనంగా ఉన్నందున, జబల్‌పూర్‌లోని ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేసినట్లు చెప్పారు. 'బిడ్డను జబల్‌పూర్‌లోని ప్రభుత్వ అధ్వర్యంలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ ఆ శిశువు జూన్ 15న చికిత్స పొందుతూ మరణించాడు. అయితే మృతదేహాన్ని నా స్వస్థలానికి తీసుకెళ్లేందుకు ఆస్పత్రి మార్చురీ వాహనాన్ని అందించలేదు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా మృతదేహాన్ని బ్యాగ్‌లో పెట్టుకుని బస్సులో ప్రయాణించాల్సి వచ్చింది' అని తెలిపారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సంజయ్ మిశ్రా పీటీఐతో మాట్లాడుతూ జబల్‌పూర్‌లోని ప్రభుత్వాస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయినప్పుడు మగబిడ్డ బతికే ఉన్నాడని, దిండోరి జిల్లాలోని ఆస్పత్రి నుంచి శిశువును జబల్‌పూర్ ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు చెప్పారు. 'నవజాత శిశువును చేర్పించిన తర్వాత చికిత్స ప్రారంభమైంది. కానీ అతని తల్లిదండ్రులు తమ బిడ్డను డిశ్చార్జ్ చేయమని ఆస్పత్రి వైద్యులను అభ్యర్థించారు. అయితే శిశువు పరిస్థితి విషమంగా ఉన్నందున అలా చేయవద్దని వైద్యులు వారిని కోరారు' అని మిశ్రా వివరించారు. కాగా, మృతులను తీసుకెళ్లేందుకు మార్చురీ వాహనాలు అందుబాటులో ఉన్నాయని ప్రశ్నించగా, ప్రభుత్వాస్పత్రిలో అలాంటి సౌకర్యం అందుబాటులో లేదన్నారు. దిండోరి... జబల్‌పూర్ నుంచి 140 కి.మీ దూరంలో ఉంది.

కొడుకు చికిత్సకు తండ్రి ఇక్కట్లు

స్కూటర్‌పై లిఫ్ట్‌లో మూడో అంతస్తుకు

కోట: రాజస్థాన్‌లోని ఒక ఆసుపత్రిలో వీల్‌ఛైర్ అందుబాటులో లేకపోవడంతో ఒక తండ్రి గాయపడిన తన కుమారుడిని స్కూటర్‌పై ఎక్కించుకుని పై అంతస్తుకు తీసుకెళ్లాల్సి వచ్చింది. కోట జిల్లాలో గురువారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కోట ప్రాంతానికి చెందిన మనోజ్ జైన్ వృత్తిరీత్యా న్యాయవాది. ఆయన కుమారుడికి ఇటీవల కాలు విరిగింది. కట్టు మార్పించేందుకు గత గురువారం స్థానిక ఎంబీఎస్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆర్థోపెడిక్ వార్డు మూడో అంతస్తులో ఉంది. ఆసుపత్రిలో వీల్‌ఛైర్ అందుబాటులో లేదు. దీంతో మనోజ్ జైన్ తన కుమారుడిని స్కూటర్‌పై ఎక్కించుకుని పై అంతస్తుకు తీసుకెళ్లారు. మనోజ్, ఆయన కుమారుడు స్కూటర్‌పై లిఫ్ట్ వరకు వెళ్లి అందులో ఎక్కి మూడో అంతస్తుకు వెళ్లారు. కట్టు మార్పించుకుని మళ్లీ అలాగే కిందకు వచ్చారు. అయితే, తిరిగి వస్తుండగా వార్డ్ ఇన్‌ఛార్జ్ వారిని అడ్డుకుని స్కూటర్ తాళాలు తీసుకున్నారు. దీంతో మనోజ్ జైన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

వీల్‌ఛైర్ లేకపోవడంతోనే తాను ఇలా చేయాల్సి వచ్చిందని ఆసుపత్రి యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. చక్రాల కుర్చీ కోసం తాను సిబ్బందిని అడిగానని, వారు లేదని చెప్పడంతో సిబ్బంది అనుమతి తీసుకునే స్కూటర్‌పై తీసుకెళ్లానని చెప్పారు. అయినా.. తనను అడ్డుకున్నారని ఆసుపత్రి యాజమాన్యం తీరును నిరసించారు. సమాచారమందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సర్దిచెప్పారు. మనోజ్ స్కూటర్‌పై వెళ్తున్న దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్ కావడంతో ఇది కాస్తా వివాదాస్పదంగా మారింది. ఆసుపత్రి తీరుపై అనేక మంది ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమ వద్ద వీల్‌ఛైర్ల కొరత ఉందని, దీన్ని త్వరలోనే పరిష్కరిస్తామని ఆసుపత్రి యాజమాన్యం చెప్పడం కొసమెరుపు.

న్యాయవ్యవస్థ చట్టాలు చేయదు : వెంకయ్య

ముంబై: చట్టాలను రూపొందించడంలో న్యాయవ్యవస్థకు పాత్ర లేదని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. ముంబైలో జరిగిన శాసనసభ్యుల జాతీయ సదస్సులో మాట్లాడుతూ రాజ్యాంగంలో పరిపాలన, న్యాయవ్యవస్థ, శాసనసభల పాత్రపై స్పష్టతుంది. ఎవరూ ఎవరికి అతీతులు కాబోరు. పరిధిని అతిక్రమించడం తగదు. శాసనాధికారాలు కేవలం శాసనసభలకే పరిమితం. చట్టాలు రాజ్యాంగ నిబంధనలకు అనుకూలమా కాదా అన్నది కోర్టులు నిర్ణయిస్తాయి. కానీ చట్టాలను రూపొందించడంలో వాటికి పాత్ర లేదన్న విషయాన్ని గమనంలో ఉంచుకోవాలి' అని వెంకయ్య చెప్పారు. శాసనసభలు నిర్ణయిస్తాయి... పరిపాలనా యంత్రాంగం ఆచరిస్తుంది.... అతిక్రమణలు జరిగినప్పుడు న్యాయస్థానాలకు పని ఉంటుందని ఆయనన్నారు. న్యాయవ్యవస్థ డైనమిక్‌గా ఉండాలని, కేసులను సాధ్యమైనంత తర్వగా పరిష్కరించగలగాలని అన్నారు. అధికారాలపై తాజా వివాదంతో వెంకయ్య వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. పార్లమెంటులో సముచిత చట్టం రూపొందే వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ ఎంపిక కోసం ప్రతిసభ్య కమిటీని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది. అయితే చట్టసభలు తరచూ రసాభాస అవుతుండటంపై వెంకయ్య ఆందోళన వ్యక్తంచేశారు. పార్లమెంటులోగానీ అసెంబ్లీలలోగానీ కాగితాలు చించివేయడం, మైకులు విరగొట్టడం వంటివి జరగకుండా తమ పార్టీల నేతలకు ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు వర్తింపజేయాలని సూచించారు. 'సభల్లో ప్రతిపక్షాలు ఉండకూడదు, అభిప్రాయ బేధాలు ఉండరాదని చెప్పడం లేదుగానీ నిరసన అన్నది హుందాగా జరగాలని మాత్రమే సూచిస్తున్నా. ఆందోళనలు, అభిప్రాయబేధాలు, చర్చలు ప్రజాస్వామ్యంలో భాగం. మనం ఒకర్నొకరం గౌరవించుకోవాలి, అసెంబ్లీలో జరిగే చర్చలప్పుడు హుందాగా ప్రవర్తించాలి. పార్లమెంటరీ ప్రజాస్వామ్య గౌరవమర్యాదలకు విఘాతం కలిగించే పనులను సభల లోపలగానీ బయటగానీ ప్రజా ప్రతినిధులు చేయరాదు' అని వెంకయ్య నాయుడు అన్నారు.

సిక్కిం, అసోంలో ఆకస్మిక వరదలు

చిక్కుకుపోయిన 2400 మంది పర్యాటకులు

గాంగ్‌టక్/గువహటి: సిక్కిం, అసోంను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఆకస్మిక వరదల ధాటికి రోడ్లు కొట్టుకుపోయాయి. అసోంలో 11 జిల్లాలను వర్షాలు ముంచెత్తాయి. 34వేల మంది నిరాశ్రయులయ్యారు. భారీ వర్షాల కారణంగా ఉత్తర సిక్కిం జిల్లాలోని లాచెన్- లాచుంగ్ ప్రాంతంలో 2,400 మందికిపైగా పర్యాటకులు చిక్కుకుపోయినట్లు అధికారులు తెలిపారు. చుంగ్తాంగ్‌కు వెళ్లే రహదారి అనేక చోట్ల దెబ్బతినడంతో రాకపోకలు నిలిచిపోయినట్లు చెప్పారు. రంగంలోకి దిగిన జిల్లా విపత్తు నిర్వహణ సిబ్బంది, సిక్కిం పోలీసులు, బీఆర్‌వో, ఐటీబీపీ, ఆర్మీ బృందాలు కలిసి సహాయక చర్యలు మొదలుపెట్టాయి. పర్యాటకుల తరలింపునకు తాత్కాలిక వంతెనలను ఏర్పాటు చేశాయి. మొత్తం 2,464 మందిని తరలించేందుకు 19 బస్సులు, 70 చిన్న వాహనాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతానికి 123 మంది పర్యాటకులతో కూడిన మూడు బస్సులు, మరో రెండు వాహనాలు రాష్ట్ర రాజధాని గాంగ్‌టక్‌కు బయలుదేరాయని చెప్పారు.

11 జిల్లాలను ముంచెత్తిన వరదలు

వర్షాకాలం పూర్తిగా మొదలు కాకముందే అసోం రాష్ట్రాన్ని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు 11 జిల్లాలను ముంచెత్తాయి. దీని కారణంగా 34 వేల మంది ప్రభావితులయ్యారు. నదులు పొంగి ప్రవహిస్తుండటంతో అసోంలో ఈ ఏడాది తొలి వరదలు నమోదయ్యాయి. అసోం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏఎస్‌డీఎంఏ) ప్రకారం బ్రహ్మపుత్రతోపాటు అనేక నదుల నీటిమట్టం పెరుగుతుండటంతో వరద నీరు వందలాది గ్రామాలను ముంచెత్తింది. అయితే ఏ నది ప్రమాదకర స్థాయికి మించి ప్రవహించడం లేదని ఏఎస్‌డీఎంఏ తెలిపింది. అసోం అంతటా 209.67 హెక్టార్లలో పంట దెబ్బతిన్నాయని తెలిపింది. వరదల వల్ల బిశ్వనాథ్, దర్రాంగ్, ధేమాజీ, దిబ్రూగఢ్, లఖింపూర్, తముల్‌పూర్, ఉదల్‌గురి జిల్లాలు ప్రభావితమయ్యాయని.. 34 వేలమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

ఫిరాయింపులతో ప్రభుత్వాలను కూల్చే సంప్రదాయం ప్రమాదకరం

ఎమ్మెల్యేల జాతీయ సదస్సులో గెహ్లాట్

జైపూర్: అధికారపక్షానికి చెందిన ఎమ్మెల్యేలకు డబ్బు, పదవుల ఆశ చూపి తమ వైపునకు తిప్పుకోవడం ద్వారా ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేసే సంప్రదాయం ప్రమాదకరమని రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాట్ అన్నారు. ఈ పద్ధతి దేశానికి మంచిది కాదన్నారు. పార్టీలు ఫిరాయించకుండా సొంత పార్టీకి నిబద్ధులుగా, విధేయులుగా ఉండటం ప్రజా ప్రతినిధుల ధర్మమని నొక్కిచెప్పారు. ఫిరాయింపులనే అస్త్రాన్ని ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చేందుకు వినియోగించే సంప్రదాయం కొనసాగుతోందని శాసనసభ్యుల జాతీయ సదస్సులో గెహ్లాట్ ఉద్ఘాటించారు. తన నివాసం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముంబై సదస్సులో మాట్లాడుతూ భారతదేశానికి ప్రపంచంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం ఉన్నాయని చెప్పారు.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో రెండు రాజకీయ పార్టీల మధ్య సైద్ధాంతిక పోరు సాగుతుందని, దానిని వ్యక్తిగతంగా మార్చరాదన్నారు. గతంలో పార్టీల మధ్య అనేక విషయాల్లో అభిప్రాయభేదాలు ఉన్నాగానీ సామరస్యత ఉండేదిగానీ నేడు అది లోపించిందని చెప్పారు. గత సంప్రదాయానికి పునరుద్ధరించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాసేవకు మార్గం రాజకీయమని, ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడమే రాజకీయాల్లోకి వచ్చేవారి లక్ష్యం కావాలని గెహ్లాట్ అన్నారు. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా ఉన్న ఎమ్మెల్యేలు హాజరుకావడం ప్రజాస్వామ్యానికి శుభసూచికమని, పార్టీ సిద్ధాంతాలను పక్కకు పెట్టి ఐక్యత, సామరస్యతకు కలిసి రావడం, 25 ఏళ్ల తర్వాత విధాన సభ, విధాన పరిషత్ బాధ్యతలపై చర్చ జరపడం శుభారంభమని ఆయనన్నారు.

చాలా ఏళ్లుగా వేధింపులను భరించాం

- మా ఆందోళన రాజకీయ ప్రేరేపితం కాదు
- రెజ్లర్లు సాక్షి మాలిక్, సత్యవర్త్ కాడియన్

న్యూఢిల్లీ: 'రెజ్లర్లు ఐక్యంగా లేనందున చాలా ఏళ్లుగా వేధింపులను మౌనంగా భరించాం, మా ఆందోళన రాజకీయ ప్రేరేపితం కాదు' అని ఒలింపిక్ విజేత సాక్షి మాలిక్, ఆమె భర్త, రెజ్లర్ సత్యవర్త్ కాడియన్ తెలిపారు. తమ ఆందోళన గురించి తప్పుడు ప్రచారం జరుగుతున్నందు స్పష్టతివ్వాలని భావించి శనివారం ట్విట్టర్‌లో ఓ వీడియో పెట్టారు. తమ పోరాటం డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్షుడిపైనే కానీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాదని చెప్పారు. జనవరిలో జంతర్ మంతర్ వద్దకు వచ్చాం. ఇద్దరు బీజేపీ నేతల ద్వారా పోలీసుల అనుమతి పొందామని సత్యవర్త్ చెప్పారు. సంబంధిత లేఖను సాక్షి చూపగా అందులో మాజీ రెజ్లర్ బబితా ఫోగాట్, తీరథ్ రాణా పేర్లు ఉన్నాయి. వీరిద్దరు బీజేపీ నాయకులు.

'మా ఆందోళనకు కాంగ్రెస్ మద్దతుగా లేదు. వేధింపులు, బెదిరింపుల గురించి రెజ్లర్లలో దాదాపు అందరికీ తెలుసు. ఇది 10-12ఏళ్లుగా జరుగుతోంది. గళమెత్తాలని ఎవరైనా అనుకున్నా రెజ్లర్లలో ఐక్యతలేక మిన్నకుండిపోయేవారు' అని సత్యవర్త్ తెలిపారు. సాక్షి మాలిక్ మాట్లాడుతూ 'రెజ్లర్లలో ఐకమత్యం లేని కారణంగా మౌనంగా వేధింపులను భరించాం. మైనర్ రెజ్లర్ తన వాంగ్మూలాన్ని వెనక్కి తీసుకోవడం మీకు తెలుసు.ఆమె కుటుంబాన్ని బెదిరించారు. రెజ్లర్లు అందరూ పేద కుటుంబాల వారు. సమాజంలో పేరున్న వ్యక్తిని నేరుగా ఢీకొనడానికి చాలా ధైర్యం కావాలి' అని అన్నారు. ఖాప్ నేతలు మే 28న మహిళా సమ్మాన్ మహా పంచాయత్‌కు పిలుపునివ్వగా తాము అనుసరించామని చెప్పి ఆరోజు పోలీసులు ప్రదర్శించిన దాష్టీకం కలచివేశాయని ఆవేదన వ్యక్తంచేశారు. దేశం కోసం ఎన్నో పతకాలు గెలించిన తమ గౌరవం మంటగలిసిందని, నాడు అనుభవించినది మాటల్లో చెప్పలేమని ఆవేదన వ్యక్తంచేశారు.

'మా పతకాలను గంగలో కలిపేయాలనుకున్నాం. హరిద్వార్‌కు వెళ్లాం కానీ ప్రభుత్వం తరపు ఒకరు బజరంగ్ పూనియా చేయి పట్టుకొన్ని లాక్కెళ్లి అనేక మంది పెద్దవారితో మాట్లాడించారు. మా పతకాలను గంగలో నిమజ్జనం చేసివుంటే ఆరోజు హింస జరిగేది. అందుకే వెనక్కి తగ్గాం. పతకాలను కోచ్‌లు, తల్లిదండ్రులకు ఇచ్చాం. ఆ సమయంలో కుట్ర జరుగుతుందో లేదో పరిసగట్టే పరిస్థితిలో లేము. మానసిక ఒత్తిడికి లోనయ్యాం. మాకు రెజ్లింగ్ తప్ప మరో ప్రపంచం తెలియదు. ఈ పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో అర్థం కాలేదు. మా తరపున ఉన్నదెవరో, ప్రభుత్వం తరపు వారు ఎవరో తెలియలేదు. చాలా మందిని కలిశాంగానీ ఎవరిని నమ్మాలో అర్థంకాలేదు. కేంద్ర హోంమంత్రిని కలిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్న సూచనలను పాటించాం' అని సత్యవర్త్, సాక్షి మాలిక్ అన్నారు. తప్పుడు ప్రచారాన్ని నమ్మవద్దని, తమపై కోపం తెచ్చుకోవద్దని ఖాప్ నాయకులకూ రెజ్లర్లు విన్నవించారు. తెలిసో తెలియకో తాము ఏదైన తప్పు చేసివుంటే క్షమించాలని కోరారు. తమ పోరాటంలో కలిసి వచ్చిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. 'మనలో ఐక్యత లేకపోతే దానిని సదవకాశంగా యంత్రాంగం తీసుకుంటుందని, అన్యాయం జరిగితే ఎదిరించాలని, ఐక్యంగా గళమెత్తాల'ని 11 నిమిషాల విడివల వీడియోలో సత్యవర్త్ పిలుపునిచ్చారు.

ఇకపై నీట్‌లో 'ఫిజిక్స్' మార్కులకు ప్రాధాన్యం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పరీక్షా ఫలితాల్లో మెరిట్ లిస్ట్‌ను నిర్ణయించే ప్రక్రియలో మార్పులు చేయాలని జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) నిర్ణయించింది. ఒకే స్కోరు వచ్చిన అభ్యర్థులకు ర్యాంక్‌లు కేటాయించడంలో ఇకపై ఫిజిక్స్ మార్కులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం బయాలజీ మార్కులకు ప్రాధాన్యమిస్తుండగా ఇకపై ఆ నిబంధనను సవరించాలని నిర్ణయించింది. ఈ మేరకు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్ -2023ను జాతీయ వైద్య మండలి ఇటీవల విడుదల చేసింది. రెండు సబ్జెక్టుల మార్కులు కూడా ఒకే విధంగా ఉంటే కంప్యూటర్ ఆధారిత డ్రా ద్వారా మెరిట్ లిస్ట్‌ను తయారు చేయనున్నట్లు ఎన్ఎంసీ వెల్లడించింది. ఇందులో మానవ ప్రమేయం ఏమీ ఉండదని పేర్కొంది. ఈ కొత్త నిబంధనలను వచ్చే ఏడాది నుంచి అమల్లోకి తీసుకొచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీనిపై జాతీయ వైద్య మండలి, జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ త్వరలోనే మరింత వివరణ ఇవ్వనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. నీట్ - యూజీ పరీక్షకు హాజరైన విద్యార్థులు ఒకే స్కోరు/మార్కులు సాధించినప్పుడు 'టై' అవుతుంది. నిబంధనల ప్రకారం అలాంటి సమయాల్లో ర్యాంకులను కేటాయించేందుకు టై-బ్రేకర్ నిబంధనను పాటిస్తారు. ప్రస్తుతమున్న నిబంధనల ప్రకారం ఇలా టై అయినప్పుడు బయాలజీ మార్కులను చూస్తారు. అందులో ఎవరికి ఎక్కువ వస్తే వారికి ర్యాంక్ కేటాయిస్తారు. తక్కువ వచ్చిన వారికి ఆ తర్వాతి ర్యాంక్ ఇస్తారు. బయాలజీలోనూ ఒకే మార్కులు ఉంటే కెమిస్ట్రీ, ఆ తర్వాత ఫిజిక్స్ మార్కులు చూసి ర్యాంకులను కేటాయిస్తున్నారు. సబ్జెక్టుల్లోనూ టై ఉంటే అభ్యర్థి వయసు బట్టి పెద్దవారికి మొదట ర్యాంక్ కేటాయిస్తారు. అయితే, ఈ టై బ్రేకింగ్ నిబంధనలను మార్చాలని జాతీయ వైద్య మండలి తాజాగా నిర్ణయించింది. కొత్త నిబంధనల ప్రకారం విద్యార్థుల స్కోరు సమానమైనప్పుడు తొలుత ఫిజిక్స్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా ర్యాంకులను కేటాయిస్తారు. అవి కూడా సమానంగా ఉంటే కెమిస్ట్రీ, ఆ తర్వాత బయాలజీ మార్కులను పరిగణిస్తారు. అప్పటికీ టై వీడకపోతే కంప్యూటర్‌తో డ్రా తీసి ర్యాంకును కేటాయించాలని నిర్ణయించింది. ఈ కంప్యూటర్ డ్రాలో మానవ జోక్యం ఉండదని ఎన్ఎంసీ అధికారులు చెబుతున్నారు.

మెరిట్ జాబితాతో పాటు మరికొన్ని నిబంధనల్లోనూ మార్పులు చేశారు. కొత్త నిబంధనల ప్రకారం ఎంబీబీఎస్ కోర్సులో చేరిన విద్యార్థులు తమ అడ్మిషన్ తేదీ నుంచి 9 ఏళ్లలో కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇక, ప్రథమ సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించేందుకు నాలుగు ప్రయత్నాలను మాత్రమే ఇచ్చింది. నీట్-యూజీ మెరిట్ లిస్ట్ ఆధారంగా దేశంలోని అన్ని మెడికల్ ఇనిస్టిట్యూట్‌లలో గ్రాడ్యుయేషన్ కోర్సుల ప్రవేశాల కోసం కామన్ కౌన్సెలింగ్ ఉంటుందని ఎన్ఎంసీ తెలిపింది.

పీఎస్‌యూలను నాశనం చేస్తున్న మోదీ

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే

న్యూఢిల్లీ: కేంద్రంలోని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖడ్గే విరుచుకుపడ్డారు. మోదీ సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను (పీఎస్‌యూలు) నాశనం చేస్తోం దని, లక్షలాది మందిని ప్రభుత్వ ఉద్యోగాలకు దూరం చేస్తోందని ఆరోపించారు. కేవలం ప్రచారం కోసమే 'మేకిన్ ఇండియా' కార్యక్రమం తీసుకువచ్చారని ట్విట్టర్ వేదికగా ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను నాశనం చేసి లక్షలాది ప్రభుత్వ ఉద్యోగాలను లాక్కున్న ప్రధాని నరేంద్ర మోదీ ఏ టూల్ కిట్‌లో భాగమంటూ ప్రశ్నించారు. దేశ ఆర్థిక వ్యవస్థలో పీఎస్‌యూలు ఒక ముఖ్యమైన భాగమని మోదీ సర్కారు నమ్మడం లేదా? అంటూ ప్రశ్నించారు. అలాగే, మోదీ ప్రభుత్వం ఏడు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి 3.84 లక్షల ఉద్యోగాలను తొలగించిందని, కేంద్ర ప్రభుత్వంలో మహిళల ఉపాధిని 42 శాతం తగ్గించిందని, కాంట్రాక్టు లేదా క్యాజువల్ ప్రభుత్వ ఉద్యోగాలను 88 శాతం పెంచిందని తన ట్వీట్‌కు జత చేసిన వీడియో ప్రజెంటేషన్‌లో వివరాలతో పాటు సంబంధిత గ్రాఫ్‌లను పంచుకున్నారు. కేవలం ఏడు పీఎస్‌యూల నుంచి 3.84 లక్షల ఉద్యోగాలను మోదీ ప్రభుత్వం ఎందుకు లాక్కుందని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వంలో మహిళల ఉద్యోగాలు 42 శాతం ఎందుకు తగ్గాయి? కాంట్రాక్ట్/ క్యాజువల్ ప్రభుత్వ ఉద్యోగాలు 88 శాతం ఎందుకు పెరిగా యని ప్రశ్నించారు. మేక్ ఇన్ ఇండియా 'హై వోల్టేజ్ ప్రచారం' కేవలం ప్రధాని మోదీ ప్రతిష్ఠను పెంచడానికి మాత్రమే అని ఆరోపించారు. దాని వల్ల దేశానికి ఒరిగేదేముందని ప్రశ్నించారు.

విద్యే రాష్ట్రానికి పెట్టుబడి

విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: విద్యే రాష్ట్రానికి పెట్టుబడిగా భావిస్తున్నామని, అందుకోసమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఫలితాలను మెరుగుపరచడం కోసం అనేక చర్యలు చేపడుతున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఒక విద్యార్థి బాగా చదువుకొని అభివృద్ధి చెందితే ఆ కుటుంబం అభివృద్ధి చెందుతుందని, ఆ విద్యార్థి చదివిన పాఠశాలకు, తద్వారా జిల్లాకు, రాష్ట్రానికి కూడా మంచి పేరు వస్తుందన్నారు. శనివారం స్థానిక కస్పా హైస్కూల్‌లో జిల్లా స్థాయి ఆణిముత్యాలకు నగదు బహుమతులు అందజేసే కార్యక్రమం జరిగింది. విద్యా శాఖ మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతూ అత్యుత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అవార్డులు, పురస్కారాలు ఇచ్చేందుకు ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలుతో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులనే కాకుండా వారి తల్లిదండ్రులను, వారికీ బోధించిన ఉపాధ్యాయు లను కూడా సన్మానించడం ద్వారా మిగిలిన వారికీ స్ఫూర్తి కలుగుతుందని తెలిపారు. ఇద్దరు విద్యార్థులకు సమాన మార్కులు వస్తే నగదును పంచకుండా ఇద్దరికీ వేర్వేరుగా నగదు బహుమతిని అందజేస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఆణిముత్యం కావాలని అన్నారు. ద్విభాషా పాఠ్య పుస్తకాలతో తెలుగు, ఆంగ్లం ఒకేసారి బోధించడం జరుగుతోందని, దీనివల్ల విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించగలరని తెలిపారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి మాట్లాడుతూ విద్యా పరంగా అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి చేపడుతున్నారని అన్నారు. అందుకే అమ్మ ఒడి, విద్యా కానుక వంటి పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెరగడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలే కారణమని, అందుకు సంతోషంగా ఉందని అన్నారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో లక్షా 45 వేల మంది పిల్లలకు జగనన్న విద్యా కానుక పథకం ద్వారా లబ్ధి చేకూరుతుందని తెలిపారు. పాఠశాలల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం కోసం నాడు-నేడు ద్వారా మౌలిక వసతులను కల్పిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో 392 పాఠశాలలలో స్మార్ట్ టీవీల ద్వారా తరగతులు నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం, మెరిట్ సర్టిఫికెట్, మెడల్, మెమెంటులతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులను సత్కరించారు. పాఠశాల స్థాయి, నియోజకవర్గ, జిల్లా స్థాయిలకు కలుపుకొని మొత్తంగా 46 లక్షల 28 వేల రూపాయలు నగదు పురస్కారాలను విద్యార్థులకు అందించారు. 10వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయిలో మొత్తం 330 మందికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఇంటర్మీడియట్‌లో మొత్తం 1,008 మందికి మొత్తం నిధులు 46 లక్షల 28 వేల రూపాయలు అందజేశారు. మొదటి బహుమతిగా రూ.50,000, రెండవ బహుమతిగా రూ.30,000, తృతీయ బహుమతిగా రూ.15,000 అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, రాజాం శాసన సభ్యులు కంబాల జోగులు, నగర మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్‌లు, కార్పొరేటర్‌లు, జిల్లా విద్యా శాఖాధికారి లింగేశ్వర రెడ్డి, అవార్డులు సాధించిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సేన మహిళా కార్యకర్తపై సిరాతో దాడి

థానే: మహారాష్ట్రలోని థానేలో జరిగిన ఒక కార్యక్ర మంలో శివసేన (యూబీటీ) మహిళా ఆఫీస్ బేరర్‌పై కొందరు మహిళలు సిరా విసిరి అసభ్యంగా ప్రవర్తించారని శనివారం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి కాల్వా వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ అయోధ్య పోల్ అనే బాధితురాలు కాల్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే దీనికి సంబం ధించి ఇప్పటివరకు ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం విలేకరులతో మాట్లాడిన పోలీసులు, ఇటీవల జరుపుకున్న అహల్యాబాయి హోల్కర్ జయంతిని పురస్కరించుకుని ఒక కార్యక్రమానికి ఆమెను ఆహ్వానించారని అన్నారు. 'కార్యక్రమ నిర్వాహకులు అన్ని ప్రోటోకాల్‌లను అనుసరిం చారు. ఇంతకు ముందు నాకు పంపిన బ్యానర్‌లో సేన (యూబీటీ) నాయకుల చిత్రాలు ఉన్నాయి. కానీ నేను వేదిక వద్దకు చేరుకున్నప్పుడు అక్కడ ఉన్న బ్యానర్‌లో స్థానిక కార్పొరేటర్, నా ఫోటోలు మాత్రమే ఉన్నాయి' అని ఆమె చెప్పింది. ఈ కార్యక్రమానికి సుష్మా అంధారే, స్థానిక ఎంపీ రాజన్ విచారే సహా థాకరే వర్గానికి చెందిన ఇతర నేతలు వస్తారని నిర్వాహకులు ఆమెకు ముందే చెప్పారని పోలీసులు తెలిపారు.

అయితే, వారెవరూ అక్కడ కనిపించకపోవడంతో దాని గురించి అడిగినప్పుడు నిర్వాహకులు తప్పించు కునే సమాధానాలు ఇచ్చారని ఆమె చెప్పింద న్నారు. 'కార్యక్రమం ప్రారంభమైనప్పుడు, నేను ప్రముఖుల చిత్రపటాలకు పూలమాల వేసిన వెంటనే, ఒక మహిళల గుంపు నా వైపు దూసుకు వచ్చింది. నా జుట్టును లాగి, నన్ను చెంపదెబ్బ కొట్టారు. నాపై సిరా విసిరారు' అని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యేందుకు నిర్వాహకులు తనను తప్పుదోవ పట్టించారని, ఇప్పుడు తాను భావిస్తున్నానని అన్నారు. 'నేను సేన (యూబీటీ) నాయకులతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్ర మాలకు హాజరయ్యాను. అయితే ఇలాంటివి జరగ డం ఇదే మొదటిసారి. అది కూడా ముఖ్యమంత్రి (ఏక్‌నాథ్ షిండే) సొంత గడ్డ అయిన నగరంలో' అని ఆమె వివరించారు. ఈ ఘటన మహిళల భద్రత అంశాన్ని కూడా తెరపైకి తెచ్చిందని, కేసు దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

భోళా శంకర్ డబ్బింగ్ పనుల్లో కీర్తి సురేష్

హైదరాబాద్: ఈ ఏడాది దసరా సినిమాలో వెన్నెల పాత్రతో అలరించిన కీర్తి సురేష్ ఆ విజయంతో మరోసారి తన సత్తా చాటుకుంది. ప్రస్తుతం కీర్తి చేతిలో అరడజను సినిమాలున్నాయి. అందులో భోళా శంకర్ ఒకటి. మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. ఈ సినిమాలో కీర్తి, చిరుకు చెల్లెలుగా కనిపించనుంది. కాగా తాజాగా భోళా శంకర్‌కు సంబంధించిన డబ్బింగ్ పనులు మొదలు పెట్టినట్లు ఈ బ్యూటీ ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించింది. ఈ మేరకు మెహర్ రమేష్‌తో ఉన్న ఫోటోను అభిమానులతో పంచుకుంది. మెహర్ రమేష్ దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ ఈ సినిమాతో మెగా ఫోన్ పట్టాడు. తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను ఏకే ఎంటర్‌టైనమెంట్స్, క్రియేటీవ్ కమర్షియల్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

పోలీస్ ఆఫీసర్‌గా విజయ్ దేవరకొండ

హైదరాబాద్: విజయ్ దేవరకొండ 12వ సినిమా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో వస్తున్న ఈ పీరియాడికల్ డ్రామాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తోంది ఈ చిత్రాన్ని. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో వస్తున్న ఈ సినిమా సారథి స్టూడియోస్‌లో రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యింది. భారతదేశంలోని అగ్రశ్రేణి సంగీత దర్శకులలో ఒకరైన అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకి సంగీతం సమకూరుస్తున్నారు. ఇక ఈ చిత్రానికి సంబంధించి విజయ్ దేవరకొండ కొత్త పోస్టర్ యూనిట్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో పోలీస్ గెటప్‌లో గన్ పట్టుకొని విజయ్ చాలా ఇంటెన్స్‌గా కనిపిస్తున్నాడు. ఈ సినిమాకు నిర్మాతలు ఎస్. నాగ వంశీ, సాయి సౌజన్య.

సంపత్ నంది దర్శకత్వంలో సాయిధరమ్‌తేజ్

హైదరాబాద్: ఈ ఏడాది 'విరూపాక్ష'తో హిట్‌తో జోరుమీదున్నాడు సాయిధరమ్ తేజ్. దీని తర్వాత తేజ.. పవన్ కళ్యాణ్‌తో కలిసి నటిస్తున్న 'బ్రో' సినిమాకు మంచి హైపే ఉంది. ఈ సినిమా చిత్రీకరణ చివరి దశలో ఉండగానే.. తన తర్వాతి చిత్రానికి రంగం సిద్ధం చేసుకున్నాడు. సంపత్ నందితో తేజు సినిమా ఖరారైన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు ఆల్రెడీ టైటిల్ కూడా ఖరారైనట్లు సమాచారం. 'గోలీ శంకర్' అనే మాస్ టైటిల్ పెడుతున్నారట ఈ చిత్రానికి. 'గంజా శంకర్' అనే టైటిల్ కూడా పరిశీలనలోకి వచ్చినప్పటికీ.. 'గంజా' అని పెడితే ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతికూల సంకేతాలు వెళ్తాయనే ఉద్దేశంతో 'గోలీ శంకర్' వైపే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించనున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురి మృతి

- ఎనిమిది మందికి తీవ్ర గాయాలు
- అంబేద్కర్ కోనసీమ జిల్లా మడికి జాతీయ రహదారిపై దుర్ఘటన

విశాలాంధ్ర-ఆలమూరు: అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలంలోని మడికి 216(ఏ) జాతీయ రహదారిపై శనివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నలుగురు ఘటనా స్థలంలో మృతి చెందగా, మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రావులపాలెం సీఐ రజని కుమార్, స్థానిక ఎస్ఐ ఎస్.శివప్రసాద్ తెలిపారు. ఈ ఘటనలో 8 మందికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు అందించిన వివరాల ప్రకారం, అనకాపల్లి జిల్లా చోడవరం మండలం ముందుర్తి గ్రామానికి చెందిన 9 మంది ఏపీ 35 డబ్ల్యు 2306 నంబర్ గల టాటా ఏసీ(గూడ్స్) వాహనంపై అంబేద్కర్ కోనసీమ జిల్లా మందపల్లి దైవ దర్శనానికి వెళుతున్నారు. అదే మార్గంలో నలుగురు ప్రయాణికులతో విశాఖ పట్నం విమానాశ్రయం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు వెళుతున్న ఏపీ 39సి 2266 నంబరు గల ఫోర్డు టిటానియం కారు అతి వేగంగా టాటా ఏసీ వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటనా స్థలంలో టాటా ఏసీ వాహనంలో ఉన్న బోడి వెంకటరమణ (55), ప్రత్తివాడ కన్నయ్య లింగం (55), గంగిరెడ్ల శ్రీను (35) మృతి చెందగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బోడి వెంకీ నాయుడు (45) మరణించాడు. అలాగే కారు అక్కడే ఉన్న చెట్టును బలంగా ఢీకొనడంతో పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం లంకలకోడేరు గ్రామానికి చెందిన కారు డ్రైవర్ విగ్నేస సుబ్రహ్మణ్యం (45) అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన 8 మందిని చికిత్స నిమిత్తం హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కొత్తపేట డీఎస్పీ కె.వెంకటరమణ, రావులపాలెం సీఐ రజిని కుమార్, ఎస్ఐ శివప్రసాద్ సంఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే జిల్లా రవాణా శాఖ అధికారి డి.అశోక్ ప్రతాప్‌రావు, మండపేట మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, టోల్ మేనేజర్ నెహేమియా, జాతీయ రహదారుల సూపర్‌వైజర్ రమేష్, హైవే అధికారి రమేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మండపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఎన్ఎస్‌జీ మాజీ అధికారి రూ.45 కోట్ల ఆస్తులు జప్తు: ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ, గురుగ్రామ్, మనేసర్‌లో 'బ్లాక్ కాట్స్' కమాండో దళ స్థావరంలో పనుల కోసం టెండర్ పత్రాల ఫోర్జరీ కేసులో ఎన్ఎస్‌జీ మాజీ అధికారి ప్రవీణ్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యుల రూ.45కోట్ల ఆస్తులను ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అటాచ్ చేసింది. రూ.45.20కోట్ల విలువ చేసే 52 చర, స్థిరాస్తుల జప్తునకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఉత్తర్వులు జారీ అయినట్లు ఈడీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. యాదవ్ సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) నుంచి డిప్యూటేషన్‌పై నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్ఎస్‌జీ)లో చేశారని, మనేసర్ కమాండో దళానికి టీమ్ కమాండర్‌గా వ్యవహరించారని పేర్కొంది. ఎన్ఎస్‌జీ ఒప్పందాల పేరిట మోసాల గురించి గతేడాది జనవరిలో బహిర్గతమైంది. కమాండో దళంలో పనిచేసే ఐఎఫ్ఎస్ అధికారిగా అవతారం ఎత్తిన ఎన్ఎస్‌జీ అధికారిని గురుగ్రామ్ పోలీసులు అరెస్టు చేయడంతో యాదవ్ మోసాల చిట్టా వెలుగుచూసింది. ఆయన భార్య మమతా యాదవ్, సోదరి రితూరాజ్ (గురుగ్రామ్‌లోని యాక్సిస్ బ్యాంకు మేనేజర్), దినేశ్ మోహన్ సోర్థి, కమాల్ సింగ్(కోషియా ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్) నవీన్ ఖటోడియా (యాక్సిస్ బ్యాంకు), మరికొందరు గుర్తుతెలియని వ్యక్తులు నిందితులుగా ఉన్నారని, మొత్తం ఐదు ఎఫ్ఐఆర్‌లను పోలీసులు నమోదు చేశారని ఈడీ వెల్లడించింది. గురుగ్రామ్ యాక్సిస్ బ్యాంకు శాఖలో మనేసర్-సెంట్రల్ వేర్‌హౌస్ ఎన్ఎస్‌జీ కోసం ఈఎండీ (ఎర్నెస్ట్ మనీ డిపాజిట్) పేరిట నకిలీ ఖాతాను యాదవ్ తెరిచారని, ఎన్ఎస్‌జీ స్థావరంలో పనులకు టెండర్ల నకిలీ పత్రాలను ఫిర్యాదుల (ఆసక్తిగల కాంట్రాక్టర్లు)కు ఇచ్చి వారి నుంచి మోసపూరితంగా డబ్బు పొందినట్లు ఆరోపణలు ఉన్నట్లు దర్యాప్తు సంస్థ పేర్కొంది. యాదవ్‌కు నకిలీ బ్యాంకు ఖాతాలు చాలానే ఉన్నాయని, అక్రమ సొత్తును వేర్వేరు ఖాతాల్లోకి బదిలీ చేయడం లేక ట్రేడింగ్ చేయడం లేక కుటుంబ సభ్యుల పేరిట ఆస్తులు కొనడమే కాకుండా భూములు, విలాసవంత కార్ల కొనుగోలునకు నిధులను మళ్లించడం వంటివి యాదవ్ చేసినట్లు ఈడీ వెల్లడించింది.

టెస్టుల్లో బంగ్లా ప్రపంచ రికార్డ్

ఢాకా: టెస్టు క్రికెట్‌లో బంగ్లాదేశ్ ప్రపంచ రికార్డు సృష్టించింది. అఫ్గానిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టులో ఏకంగా 546 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో 21వ శతాబ్దంలో టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగుల తేడాతో గెలిచిన జట్టుగా ప్రపంచ రికార్డు సృష్టించింది. ఓవరాల్‌గా చూసుకుంటే ఆస్ట్రేలియాపై ఇంగ్లాండ్ 675 పరుగుల తేడాతో (1928లో) విజయం సాధించి అగ్రస్థానంలో ఉండగా.. ఇంగ్లాండ్‌పై ఆసీస్ 562 పరుగుల తేడాతో (1934లో) గెలుపొంది రెండో స్థానంలో ఉంది. ఇక, బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్ మ్యాచ్ విషయానికొస్తే.. తొలి ఇన్నింగ్స్‌లో 6 పరుగులకే మొదటి వికెట్ కోల్పోయిన బంగ్లాదేశ్.. నజ్ముల్ హుస్సేన్ షాంటో (146) శతకానికితోడు మహ్మదుల్లా హసన్ (76), ముష్ఫికర్ రహీమ్ (47), హసన్ మిరాజ్ (48) రాణించడంతో 382 పరుగులు చేసింది. బంగ్లా బౌలర్ల ధాటికి అఫ్గానిస్థాన్ 146 పరుగులకే కుప్పకూలింది. అఫ్సర్ జాజయ్ (36) టాప్ స్కోరర్. తొలి ఇన్నింగ్స్‌లో 236 పరుగుల ఆధిక్యం సంపాదించిన బంగ్లాదేశ్.. రెండో ఇన్నింగ్స్‌లోనూ భారీ స్కోరు చేసింది. నజ్ముల్ హుస్సేన్ శాంటో (124) మరోసారి శతకంతో విరుచుకుపడ్డాడు. మోమినుల్ హక్ (121) కూడా సెంచరీ చేయడంతో 425/4 వద్ద బంగ్లాదేశ్ రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే ఆలౌటైన అఫ్గానిస్థాన్ రెండో ఇన్నింగ్స్‌లో అంతకంటే తక్కువ స్కోరుకే చేతులెత్తేసింది. తస్కిన్ అహ్మద్ (4/37), షారిఫుల్ ఇస్లాం (3/28) చెలరేగడంతో అఫ్గాన్ జట్టు 115 పరుగులకే కుప్పకూలింది. దీంతో బంగ్లాదేశ్ రికార్డు విజయాన్ని సొంతం చేసుకుంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.